జగనన్న ఆరోగ్య సురక్ష
ప్రివెంటివ్ హెల్త్ కేర్‌లో నూతన అధ్యాయం
రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజులపాటు నిర్వహించే "జగనన్న ఆరోగ్య సురక్ష" క్యాంపులను 29 సెప్టెంబర్, 2023న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, తాడేపల్లి నుండి లాంఛనంగా ప్రారంభించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM

జగనన్న ఆరోగ్య సురక్ష
ప్రివెంటివ్ హెల్త్ కేర్‌లో నూతన అధ్యాయం
45 రోజుల వ్యవధిలో 5,000 మందికి పైగా డాక్టర్లతో 1.67 కోట్ల కుటుంబాలను కవర్ చేస్తూ, 14 రకాల డయాగ్నస్టిక్ కిట్స్ 172 రకాల మందులతో 10,574 ఉచిత ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించనున్న జగనన్న ప్రభుత్వం..

అనంతపురం : fb.com/vaartha
PUBLISHED FROM ANANTAPUR, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
30-9-2023 శనివారం సంపుటి : 29 సంచిక : 241, పేజీలు : 08+4 వెల : 6.50

రాష్ట్రంలోని ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ప్రతి ఇంటి గడపవద్దనే ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, ఒక్క రూపాయి కూడా భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా..

# జగనన్న ఆరోగ్య సురక్ష

1 ఉచితంగా వైద్య పరీక్షలు

2 ఉచితంగా స్పెషలిస్ట్ వైద్య సేవలు

ఉచితంగా మందులు 3

ఉచితంగా కంటి పరీక్షలు, కళ్లద్దాలు 4

డా॥ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆరోగ్య ఆసరాపై అవగాహన-అవసరమైన వారికి అనుసంధానం 5

## ప్రివెంటివ్ హెల్త్ కేర్‌లో నూతన అధ్యాయం

రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజులపాటు నిర్వహించే "జగనన్న ఆరోగ్య సురక్ష" క్యాంపులను 29 సెప్టెంబర్, 2023న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, తాడేపల్లి నుండి లాంఛనంగా ప్రారంభించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి.. .. 45 రోజుల వ్యవధిలో 5,000 మందికి పైగా డాక్టర్లతో 1.67 కోట్ల కుటుంబాలను కవర్ చేస్తూ, 14 రకాల డయాగ్నస్టిక్ కిట్స్, 172 రకాల మందులతో 10,574 ఉచిత ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించనున్న జగనన్న ప్రభుత్వం..

దేశంలో ఎక్కడా లేని విధంగా.. ప్రతి ఇంటికి వెళ్లి మరీ ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం.. ఉచితంగా వైద్య పరీక్షలు - హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ఉచితంగా స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు - మందులు - ఉచితంగా కళ్లద్దాలు, హెల్త్ ప్రొఫైల్ మ్యాపింగ్‌తో పాటు "డా॥ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ", "ఆరోగ్య ఆసరా" పై అవగాహన, అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపడం లాంటి జాగ్రత్తలతో పాటు వారు పూర్తి ఆరోగ్యవంతులయ్యేంతవరకు వారిని చేయి పట్టుకుని నడిపించే వినూత్న కార్యక్రమం "జగనన్న ఆరోగ్య సురక్ష.."



సెప్టెంబర్ 15 నుండి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తూ, ఇప్పటికే ప్రాథమిక పరీక్షలతో ఆరోగ్య సమస్యలను గుర్తిస్తున్న జగనన్న ప్రభుత్వం.. నేటి నుండి నవంబర్ 15 వరకు 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్, 542 అర్బన్ హెల్త్ క్లినిక్స్ వారీగా షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాల ఏర్పాటు..

రాష్ట్రంలోని ప్రజల అన్నిరకాల ఆరోగ్య సమస్యలను గుర్తించి తగు వైద్యం అందించడంతో పాటు, గర్భిణులు, బాలింతలు, రక్తహీనత బాధితులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ మందులు, ఫుడ్ సప్లిమెంట్స్ కూడా ఉచితంగా అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

సెప్టెంబర్ 15న ప్రారంభమైన "జగనన్న ఆరోగ్య సురక్ష"లో భాగంగా ఇప్పటికే 57,68,505 కుటుంబాలను సందర్శించి 2,28,99,516 వైద్య పరీక్షలు నిర్వహించిన జగనన్న ప్రభుత్వం..

## ఐదు దశల్లో "జగనన్న ఆరోగ్య సురక్ష"

### మొదటి దశ
### గృహ సందర్శన..

సెప్టెంబర్ 15 నుండి షెడ్యూల్ ప్రకారం ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష, డా॥ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు, జగనన్న మీద, జగనన్న ప్రభుత్వం మీద ప్రేమ, అభిమానం ఉన్న ఔత్సాహికులతో కూడిన టీమ్..

సెప్టెంబర్ 15 నుంచి షెడ్యూల్ ప్రకారం మీ సచివాలయ పరిధిలో హెల్త్ క్యాంప్ ప్రారంభానికి 15 రోజుల ముందు..

### రెండవ దశ
### ఉచిత వైద్య పరీక్షలు, టోకెన్‌ల జారీ..

ఏఎన్ఎం, సీహెచ్‌వో, ఆశా వర్కర్ల ద్వారా వాలంటీర్ల సహకారంతో ప్రజలకు ఇంటివద్దే బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, స్పూటమ్ (కళ్లె) పరీక్షలతో పాటు జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా, డెంగీ లాంటి మొత్తం 7 రకాల పరీక్షలు నిర్వహించి.. ఫలితాలు ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదు తర్వాత ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పిస్తారు.. హెల్త్ క్యాంపు తేదీ, స్థలం వంటి వివరాలతో కూడిన టోకెన్‌ల జారీ..

షెడ్యూల్ ప్రకారం మీ సచివాలయ పరిధిలో హెల్త్ క్యాంపు ప్రారంభానికి 14 రోజుల ముందు నుండి..

### మూడవ దశ
జరగనున్న "జగనన్న ఆరోగ్య సురక్ష" హెల్త్ క్యాంప్ పై అవగాహన కల్పించేందుకు వాలంటీర్లు, ప్రజా ప్రతినిధుల ఇంటింటి సందర్శన..

ఆరోగ్య సమస్యలున్నవారు వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు వీలుగా వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు, జగనన్న మీద, జగనన్న ప్రభుత్వం మీద ప్రేమ, అభిమానం ఉన్న ఔత్సాహికులతో కూడిన టీమ్ మీ సచివాలయ పరిధిలో హెల్త్ క్యాంప్ నిర్వహించే 3 రోజుల ముందు సదరు గృహాలను మరోసారి సందర్శించి హెల్త్ క్యాంపు పై అవగాహన కల్పించి తేదీ, స్థలం వివరాలు గుర్తు చేస్తారు..

షెడ్యూల్ ప్రకారం హెల్త్ క్యాంపునకు 3 రోజుల ముందుగా..

### నాల్గవ దశ
### జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం.. (హెల్త్ క్యాంప్)

10,032 విలేజ్ హెల్త్ క్లినిక్స్ పరిధిలో ఎమ్మార్వో /ఎంపీడీవోలు, 542 యుపిహెచ్‌సిల పరిధిలో మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారు. నలుగురు సీనియర్ డాక్టర్లచే ఉచిత వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ.. అవసరమైన వారికి ఉచితంగా కంటి పరీక్షలు, కళ్లద్దాలు, ఈసీజీ మరియు రక్త పరీక్షలు, అవసరమైన వారికి ఫుడ్ సప్లిమెంట్స్ మ్యాపింగ్‌తో పాటు "డా॥ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ", "ఆరోగ్య ఆసరా" పై అవగాహన.. టోకెన్‌లు లేనివారు కూడా నేరుగా క్యాంపు వద్దకు వచ్చి ఉచిత వైద్యసేవలు పొందేలా ప్రత్యేక ఏర్పాట్లు..

షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 15 వరకు మీ సచివాలయ పరిధిలో హెల్త్ క్యాంపు..

### ఐదవ దశ
### నిరంతర పర్యవేక్షణ..

మెరుగైన వైద్యం కోసం హెల్త్ క్యాంపులలో డాక్టర్లు సిఫారసు చేసిన రోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చేర్చి అవసరమైన వైద్యం అందేలా చేస్తూ, ఇప్పటికే ఆరోగ్యశ్రీ సేవలు అందుకున్న వారికి ఫాలోఅప్ సేవలు, ఉచితంగా మందులు అందించేందుకు వీలుగా గ్రామానికి చెందిన ఫ్యామిలీ డాక్టర్, వాలంటీర్లు, సీహెచ్‌ఓ, ఏఎన్ఎంలు వారికి తోడుగా నిలిచి చేయి పట్టుకుని నడిపిస్తారు..

నిరంతరం మీ చేయి పట్టుకుని తోడుగా ఉంటూ..

## ఇది ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వం..

శ్రీమతి. విడదల రజిని, వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

30-9Pg4 :Layout 1 30/09/23 10:47 PM Page 1



వార్త


స్నేహితుడు లేని జీవితం
సాక్ష్యం లేని కేసులాంటిది.

-జార్జి బెర్నార్డ్ షా

# వన్యప్రాణులకు కొరవడుతున్న భద్రత


దేశంలో వన్యప్రాణుల సంరక్షణకు యేటా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నా కొందరి అధికారుల అవినీతి, నిర్లక్ష్యం వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. అరణ్యాలను, వన్యప్రాణులను స్మగ్లర్లు, వేటగాళ్లకు వదిలి అధికారులు జనారణ్యాలకే పరిమితమవుతున్నారు. ఫలితంగా అధికారులు ఒక దిక్కు, అడవులు ఒక దిక్కు కావడంతో కాకులు దూరని కీకారణ్యాలు సైతం మైదానాలుగా మారిపోతున్నాయి. యేడాదియేడాదికి అడవుల విస్తీర్ణం తగ్గిపోతుండడం, వన్యప్రాణులకే కాదు పర్యావరణానికి కూడా తీవ్ర విఘాతం కలిగిస్తున్నది. ఈ అడవులను స్థావరాలుగా చేసుకొని వాటి ఆధారంగా బతుకుతున్న పులులు, ఏనుగులు, దుప్పులు, అడవికోళ్లు, పందులు ఇలా ఒక్కటేమిటి సమస్త వన్యప్రాణులు వేటగాళ్లబారి నుండి తప్పించుకోలేక కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అడవులను వన్యప్రాణుల రక్షణ కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టినట్లు పాలకులు పదే పదే చెప్తున్నా అడవుల నరికివేత ఏమాత్రం తగ్గడంలేదు. అత్యంత విలువైన ఎర్రచందనం శేషాచలం అడవుల నుంచి తరలించుకుపోతూనే ఉన్నారు. మొన్న ఆ మధ్య రెండేళ్ల క్రితం కడప జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్ల వాహనం ప్రమాదానికి గురై లక్షలాది విలువైన ఎర్రచందనం దుంగలతోపాటు ఐదుగురు సజీవదహనం అయ్యారు. వీరంతా తమిళనాడు నుంచి చెట్లు నరకడానికి వచ్చిన కూలీలు మాత్రమే. ఇన్నేళ్లుగా కేవలం కడుపుకోసం వచ్చిన నిరుద్యోగ కూలీలే దొరుకుతున్నారు. వారినే జైళ్లకు పంపుతున్నారు తప్ప వారివెనుక ఉన్న సూత్రధారులను పట్టుకొని న్యాయస్థానాల ముందు నిలబెట్టి తిరుగులేని సాక్ష్యాలతో రుజువులు చేసి శిక్షలు వేయించలేకపోతున్నారు. టేకు చెట్లతోపాటు వృక్షసంపదను నరికి తరలించుకుపోయే వారు కూడా తక్కువ సంఖ్యలో లేరు. ఈ అడవులనే స్థావరాలుగా చేసుకొని నివసిస్తున్న అనేక వన్యప్రాణుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఆహారం దొరకక వన్యప్రాణులు జనారణ్యంలోకి ప్రవేశిస్తున్నాయి. అటు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, చిత్తూరు జిల్లాల్లో ఏనుగుల గుంపులు ఆహారం కోసం వచ్చిన గ్రామాలపై దాడులు చేస్తున్నాయి. పులుల దాడులు కూడా పెరుగుతున్నాయి. మొన్న తిరుపతి నుండి తిరుమలకు వెళ్లే నడక దారిలో ఒక పసికందును చిరుతపులి తీసుకువెళ్లి చంపింది. ఆ తర్వాత టిటిడి పెట్టిన బోన్‌లలో ఐదు చిరుతపులులు పడ్డాయి. కాలినడకన వెళ్లే భక్తులకు ధైర్యంకోసం కర్రలను ఇస్తున్నారు. తెలంగాణలో కూడా పులుల దాడులు పెరుగుతున్నాయి. కొమరం బీం జిల్లా దహేగామ్ మండల పరిధిలో 22ఏళ్ల యువకుడిని పెద్దపులి దాడి చేసి చంపింది. హైదరాబాద్‌లో కూడా చిరుతపులులు బీభత్సమే సృష్టించాయి. ముంబయి, అహ్మదాబాద్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చిరుత పులి రోడ్డుపైనే మరణించింది. ఇక తెలంగాణ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని అడవుల్లో పులుల వేట ఊపందుకున్నట్లు సమాచారం. ఉచ్చుల ద్వారానో, విద్యుత్ షాక్‌తోనో, లేక మేకలు, గొర్రెలు లాంటి జంతువులను ఎరగా వేసి ప్లాస్టిక్ సంచుల్లో నింపి న క్రిమిసంహారక మందులను కట్టి మట్టుపెడుతున్నారు. అంతర్జాతీయంగా పులుల శరీరభాగాలకు గిరాకీ పెరగడంతో ఇతరప్రాంతాల కంటే దండకారణ్య ప్రాంతాల్లో పులులవధ పెరిగిపోయింది. దేశంలో 2012-19 మధ్య 750పులులు మృతిచెందినట్లు జాతీయ పులులసంరక్షణ సంస్థవెల్లడించింది. వీటిలో ప్రకృతి కారణంగా 369, అక్రమ వేటకు 168, అసహజ కారణాలతో 42 బలయ్యాయని వెలుగు చూసింది. ఆ ఎనిమిదేళ్ల కాలంలో మధ్యప్రదేశ్‌లో 173, మహారాష్ట్రలో 125, కర్ణాటకలో 111, ఆంధ్రప్రదేశ్‌లో ఏడు, తెలంగాణలో ఐదుమృతిచెందాయి. వేటాడి వన్యప్రాణులను చంపుతున్న పెద్దలపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. అందుకే అవి మళ్లీమళ్లీ పునరావృతం అవుతున్నాయి. ఇక ఏనుగుల దంతాలకు డిమాండ్ ఉండడంతో ఆ వేట కూడా జరుగుతున్నట్లు సమాచారం. ఏనుగుల దంతాల స్మగ్లర్ వీరప్పన్ మృతి చెందిన తర్వాత ఆంధ్రప్రదేశ్, చిత్తూరు జిల్లాకు చెందిన ముగ్గురువ్యక్తులు నాలుగు ఏనుగుదంతాలతో పట్టుబడ డంతో అటవీశాఖ అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా నలభై ఏనుగులకుపైగా వేట గాళ్లు మట్టుపెట్టినట్లు అధికారవర్గాలే వెల్లడిస్తున్నాయి. మొన్న ఆమధ్య కేరళలో పాల్‌కాట్ జిల్లాలోని అట్టాపూర్ గ్రామం సమీపసైలెంట్ వ్యాలీ అటవీ ప్రాంతం నుంచి ఆహారం దొరకక ఆకలితో పదిహేనేళ్ల ఏనుగుగున్న జనా రణ్యంలోకి వచ్చింది. తిండికోసం ఆకలి తీర్చుకునేందుకు ఏదైనా దొరుకుతుందని ఎదురుచూస్తున్న సమయంలో కొందరువ్యక్తులు పేలుడు పదార్థాలు కుక్కినపైనాపిల్ పండును ఏనుగు నోటికి అందించారు. ఆకలితో ఉన్నఆ మూగజీవి కొరకడంతో ఒక్కసారిగా పేలుడుసంభవించి నోరు, నాలుక, దవడపూర్తిగా చిదిమైపోయాయి. గాయాల నుంచి వచ్చే నొప్పి, మంట తాళలేక ఆ ఏనుగు పసి పాపలాగా అల్లాడిపోయింది. ఎలాంటి విధ్వంసానికి పాల్పడకుండా చల్లటి నీరు కోసం గ్రామంలోని వీధుల గుండా పరుగెత్తిసమీపంలో ఉన్నవిలియార్ నదిలో పడి ప్రాణాలు విడిచింది. అత్యంత హృదయవిదారక సంఘటన దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపింది. మూడోకంటికి తెలియకుండా మూగప్రాణులను మట్టుపెడుతున్న సంఘటనలు మరెన్నో ఉన్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాల పాల కులు అడవులను, వాటినే ఆధారంగా చేసుకొనిజీవనం సాగిస్తున్న వన్యప్రాణులకు పటిష్టమైన భద్రత కల్పించాలి.

ఈ శతాబ్దాన్ని తప్ప మిగతా అన్నింటినీ, ఈ దేశాన్ని తప్ప మిగిలిన అన్ని దేశాలను ఉత్సాహంగా కీర్తించేవాడు మూరుడు.



సర్ విలియం గిల్బర్ట్

మూర్ఖుడి మనసు కనుపాప వంటిది. దానిపై ఎంత ఎక్కువ వెలుతురు పడితే అది అంత చిన్నదిగా ముడుచుకు పోతుంటుంది.



ఓ.డబ్ల్యు.హోమ్స్

# రాజకీయ అవినీతే అసలు సమస్య!

**రాజకీయ అవినీతిని అరికట్టకుండా దేశం నుంచి దాన్ని పారద్రోలడం అంత సులభం కాదు. అందుకు నడుం కట్టడం అంటే గొంగళిలో కూర్చొని వెంట్రుకలు ఏరుకున్నట్లుగా ఉంటుంది. ఏదిఏమైనా ఎన్నో ప్రయాసలకు ఓర్చి మరెన్నో సంస్థలను, బ్యాంకులను ఒప్పించి, మెప్పించి వేలాది కోట్ల రూపాయల అప్పును వడ్డీతోసహా ప్రతిపైసా చెల్లించాల్సింది ప్రజాధనం నుండే అనే విషయాన్ని విస్మరించకూడదు. అప్పులు తెచ్చుకుంటున్న నిధులు ఇలా దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యంలో పాలకులపై ఉంది.**

దామెర్ల సాయిబాబా

ధర్మాధర్మాలు తెలియవని కాదు. మొదటిది వంటబట్టడం లేదు, రెండోది వదిలిపెట్టడం లేదు అన్నట్లుగా ఉంది అవినీతి విషయంలో కొందరు పెద్దలు వ్యవహరిస్తున్న తీరు. ఏ కోణంలో చూసినా అవినీతికి పాల్పడడం ధర్మం కాదని అందరికి తెలిసిందే. పైగా అది చట్టప్రకారం నేరం కూడా. కానీ అవినీతికి పాల్పడే వారు దేశంలో కోట్ల సంఖ్యలో ఉన్నారు. అవినీతి నిర్మూలనకు దశాబ్దాల తరబడి ప్రయత్నాలు చేస్తున్నామని పాలకపెద్దలు చెప్పుకుంటున్నా అది అంతకంతకు పెరుగుతున్నదే తప్ప ఏమాత్రం తగ్గడం లేదు. దేశ ప్రధాని నరేంద్రమోడీతోసహా అనేక మంది ముఖ్యమంత్రులు అవినీతిపై యుద్ధమే ప్రకటించారు. అవినీతికి పాల్పడినట్లు రుజువైతే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తి లేదని మంత్రులు కూడా ఇందుకు మినహాయింపు కాదని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతోసహా ఎందరో కీలక బాధ్యత వహిస్తున్న నేతలు పదేపదే చెప్తున్నారు. ఎంతమంది నేతలు ఎన్నిరకాల విన్యాసాలతో చెప్పినా, హెచ్చరికలు జారీ చేసినా అవినీతి మాత్రం అంతకంతకు పెరిగిపోతున్నది. ముఖ్యంగా ఉన్నత స్థాయిలో జరుగుతున్న అవినీతికి అడ్డులేకుండా పోతున్నది. ఆ స్థాయిలో అరికట్టేందుకు గతంలో కొన్ని ప్రయత్నాలు జరిగినా నిలువరించ లేకపోతున్నారు. కిందిస్థాయిలో అవినీతిని అరికట్టే ముందు ఉన్నత స్థాయిలో ముఖ్యంగా రాజకీయాల్లో అవినీతిని నియంత్రించే ప్రయత్నం చేస్తే బాగుంటుందనే అభిప్రాయంతో ఒక వ్యూహం ప్రకారం ఏకంగా ప్రత్యక్షంగా లంచం ఇచ్చి ఒక మంత్రినే ఇంటికి పంపారు. అప్పట్లో అది పెద్ద సంచలనం రేపింది. ఆ చర్యతో ఆ నాయకుడి రాజకీయ జీవితానికి ఫుల్‌స్టాప్ పడింది. కొంతకాలంలో అధికారుల్లో, నేతల్లో అవినీతిపట్ల కొంత భయాందోళనలు ఉన్నా ఆ తర్వాత క్రమేపీ సన్నగిల్లి గతంలో కంటే మించి ప్రబలిపోయింది. గత రెండు, మూడు దశాబ్దాలుగా అదుపు తప్పుతున్నదనే చెప్పొచ్చు. ఆశయం, నైతిక విలువలు, మానవత్వం వంటివి రానురాను అడుగంటిపోతున్నాయి. ఆశ అత్యాశగా మారి దురాశగా రూపాంతరం చెందుతున్నది. కష్టపడకుండా తెల్లవారే సరికి లక్ష్మీపుత్రులు కావాలనే దురాశ చేయరాని, చేయకూడని పనులను చేయిస్తున్నది. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడులను పట్టించుకోవడం లేదు. అందుకే ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలుకు నోచుకోలేకపోతున్నాయి. ప్రభుత్వాలు మారి కొత్త ప్రభుత్వాలు వచ్చినప్పుడు గత ప్రభుత్వాలపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణలు చేయించడం సర్వసాధారణమైంది. వాటిలో కూడా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి రుజువులతో న్యాయస్థానాల ముందు దోషులుగా నిలబెట్టలేకపోతున్నారు. నిరుపేదలకు ఇచ్చే ఇళ్ల కేటాయింపులు, రేషన్ కార్డుల్లో కానీ వృద్ధాప్య పింఛన్, సంక్షేమ కార్యక్రమాలు ఏవి తీసుకున్నా దేశవ్యాప్తంగా దళారులతో ఈ అవినీతి అధికారులు చేయి కలిపి ప్రజాసొమ్మును ఎలా భోం చేస్తున్నారో తెలియని విషయాలు ఏమీ కావు. అదేకాదు ప్రాజెక్టుల నిర్మాణాలు కానీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో ఏకంగా పర్సెంటేజీ నిర్ణయించి తీసుకుంటున్న విషయం బహిరంగ రహస్యమే, అందుకే అవినీతి, అభివృద్ధి కలిసి పయనించలేవు. అవినీతి పెరిగే కొద్దీ అభివృద్ధికి తూట్లు పడకతప్పదు. అభివృద్ధి ముందుకు నడిచే కొద్దీ అవినీతి వెనక్కి గుంజుతూ ఉంటుంది. కానీ అభివృద్ధి ఎక్కడ ఉంటుందో అవినీతి కూడా అక్కడే ఏదో ఒకరూపంలో ఉంటుంది. అభివృద్ధి పనులు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి నిధులు వెచ్చించకపోతే అసలు అవినీతి తలెత్తే ప్రసక్తే ఉండదు. ఇది అందరికి తెలిసిందే. కానీ తెలుగు రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. లక్షలాది కోట్ల రూపాయల ప్రజాసొమ్మును గుమ్మరిస్తున్నారు. ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం ఒకటేమిటి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఈ అవినీతిని నియంత్రించకపోతే లక్ష్యాలను సాధించలేరనేది అందరికి తెలిసిందే. అవినీతిని అడ్డుకొని ప్రజాధనాన్ని కాపాడేందుకు ఏనాటి నుంచో ప్రయత్నాలు జరుగు తూనే ఉన్నాయి. అవినీతి అధికారులను వదిలిపెట్టం, అవినీతికి పాల్పడేవారు ఎంతటివారైనా కఠిన శిక్షల నుంచి తప్పించుకోలేరు. అవినీతిని కూకటివేళ్లతో నిర్మూలించడమే తమ ధ్యేయమంటూ ఎన్ని రకాల అభినయాలతో చెప్పవచ్చే అన్నిరకాలుగా విన్యాసాలు పాలకులు చేస్తూనే ఉన్నారు. అవినీతిని నియంత్రించేందుకు ఆరు దశాబ్దాల క్రితమే

## ఒక్క మాట

అవినీతి నిరోధక శాఖను ఏర్పాటు చేశారు. కేంద్రస్థాయిలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)ను నెలకొల్పారు. ఇవే కాక మరెన్నో నిఘా విభాగాలున్నాయి. ఎన్నోచట్టాలు చేశారు. కోట్లాది రూపాయలు ఖర్చుచేశారు, చేస్తున్నారు. వేలాది మంది అధికారులను వలపన్ని పట్టుకున్నారు. మరెందరినో ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినందుకు అరెస్టులు చేసి జైళ్లకు పంపారు. ఆస్తులను రికవరీ చేశారు. కానీ అవినీతి ఏమాత్రం తగ్గడంలేదు. ఊదురుగొట్టం వాడు ఊదుతూ ఉంటే చల్లార్పుడు గొట్టం వాడు చల్లార్పుతున్నట్లు ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా, ఎంత మంది అధికారులను నియమించినా, ఎంతమందిపై చర్యలు తీసుకున్నా అవినీతిని నియంత్రించలేకపోతున్నది. రోజురోజుకు విజృంభిస్తున్నది. ఇందుగలడు అందులేడన్న సందేహం వలదన్నట్లుగా అంతటా వ్యాపించిపోయింది. అవినీతి అధికారులకు భయభక్తులు లేకుండా పోతున్నది. పరాకాష్ఠకు చేరిందన్నా తప్పుకాకపోవచ్చు. కీలక పదవులు నిర్వహిస్తున్న కొందరు అధికారులు, ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న మరికొందరు రాజకీయ నాయకుల దళారుల వల్లనే ఈ పరిస్థితి ఏర్పడుతున్నది. వారి రాజకీయ అధికారం దాటి సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అయితే మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని పట్టుకోవడం కష్టమైనా వాటిని వలపన్ని పట్టుకోగలుగుతున్నారు. కనుక బాహాటంగా నిర్లజ్జగా జరుగుతున్న అవినీతిని పసికట్టలేకపోవడం అనే ప్రశ్నే ఉదయించదు. అంతేకాదు అవినీతి ఏ శాఖలో, ఏ స్థాయిలో ఉన్నదో ఎసిబి అధికారులకే కాదు ప్రజలకు కూడా బాగా తెలుసు. ఎలా అదుపు చేయాలో అధికారులకు తెలుసు. నిత్యం లక్ష్మీప్రసన్నంతో కళకళలాడే కొన్ని ప్రభుత్వ విభాగాల్లో కొందరు అధికారులు బాహాటంగా డిమాండ్ చేసి వసూలు చేసుకుంటున్నారు. పబ్లిక్‌గా జరుగుతున్న ఈ దోపిడీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. శృతి మించిపోతున్నది. దేనికైనా హద్దూ అదుపు ఉండాలి. దారులుకొట్టి బతికే బందిపోట్లు సైతం దోపిడీకి దోపిడీకి కొంత వ్యవధి ఇస్తారు. ఇదంతా తెలిసినా రాజకీయ జోక్యంతో అధికారులు స్వతంత్రంగా, చట్టపరంగా వ్యవహరించలేకపోతున్నారు. పశువును కట్టేసి దూరంగా మేతవేస్తే ఎలాంటి ఉపయోగం ఉంటుందో వేరే చెప్పక్కర్లేదు. చట్టంలో కూడా కొన్ని లోపాలు ఉన్నాయి. చట్టం ముందు అందరూ సమానులే అంటారు. రాజ్యాంగం కూడా మనకు అదే ఉద్బోధిస్తున్నది. కానీ ఈ అవినీతి శాఖ వేరుగా ఉంది. సాధారణ ఉద్యోగుల విషయంలో మాత్రం తమకు అందిన సమాచారం ప్రకారం దాడులు చేయవచ్చు. ప్రత్యక్షంగా పట్టుకోవచ్చు, అరెస్టు చేయవచ్చు, జైళ్లకు పంపవచ్చు. కానీ ఉన్నతాధికారుల విషయంలో ఈ చట్టం వర్తించదు. ముందుగా ప్రభుత్వ అనుమతి పొందాలి. అనుమతి రాకపోతే ముందుకు అడుగు వేయడానికి ఉండదు. ఎంతోమంది ఉన్నతాధికారుల మీద విచారణ జరిపి దర్యాప్తులో తిరుగులేని రుజువులు సేకరించినా కేవలం అనుమతులు రాక ఏళ్లతరబడి పెండింగ్‌లో పడిపోతున్నాయి. కొన్ని కేసుల్లో అయితే సంబంధిత అధికారులు రిటైర్డ్ అయ్యేవరకు వెలుగు చూడకుండా ఉంచగలుగుతున్నారు. ఆ మధ్య ఒకసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి రాష్ట్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ రామచంద్ర సమాల్ బయటపెట్టిన విషయాలు అందుకు అద్దంపడుతున్నాయి. అంతెందుకు గత రెండు దశాబ్దాల క్రితం తెలుగు రాష్ట్రాల్లోనే ఎసిబి అధికారులు ఉన్నతస్థాయిలో ఉన్న అవినీతి అధికారులను ఎంతమందిని పట్టుకున్నారు? ఏ మేరకు శిక్షలు వేయించారు? అలాగే కిందిస్థాయిలో పట్టుబడిన ఉద్యోగుల సంఖ్య ఎంత? శిక్షల శాతం ఎంతో పరిశీలిస్తే అనేక వాస్తవాలు చెప్పకనే చెబుతాయి. ఇకపోతే అధికారులు ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి పట్టుకున్న కేసుల్లో కూడా కొందరు దళారులు మోకాలొడ్డుతున్నారు. ఇక రాజకీయ అవినీతి గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. నాయకులే బాహాటంగా ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. పేర్లు రాసి ఇబ్బంది పెట్టడం ఎందుకు కానీ పెరిగిన ఆస్తులే ప్రత్యక్ష సాక్షులుగా కన్పిస్తున్నాయి. రాజకీయ అవినీతిని అరికట్టకుండా దేశం నుంచి దాన్ని పారద్రోలడం అంత సులభం కాదు. అందుకు నడుం కట్టడం అంటే గొంగళిలో కూర్చొని వెంట్రుకలు ఏరుకున్నట్లుగా ఉంటుంది. ఏదిఏమైనా ఎన్నో ప్రయాసలకు ఓర్చి మరెన్నో సంస్థలను, బ్యాంకులను ఒప్పించి, మెప్పించి వేలాది కోట్ల రూపాయల అప్పును వడ్డీతోసహా ప్రతిపైసా చెల్లించాల్సింది ప్రజాధనం నుండే అనే విషయాన్ని విస్మరించకూడదు. అప్పులు తెచ్చుకుంటున్న నిధులు ఇలా దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యంలో పాలకులపై ఉంది.

# దేశానికి ఆహార భద్రత కల్పించిన స్వామినాథన్



డాక్టర్ శేషు తిరునహరి

భారతదేశం లాంటి వ్యవసాయక దేశం కూడా స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజులలో ఆహార కొరతను ఎదుర్కోవడమే కాదు ఆహార ధాన్యాలను అమెరికా నుండి దిగుమతి చేసుకున్న రోజుల నుండి భారతదేశం ఈ రోజు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని స్వావలంబనను సాధించి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందంటే దానికి మున్కొంబు సాంబశివన్ స్వామినాథన్ కృషి ఫలితమే. వ్యవసాయశాస్త్రవేత్తగా జన్యుశాస్త్ర నిపుణుడిగా భారతదేశ హరిత విప్లవ పితామహుడుగా పేరుగాంచిన స్వామినాథన్ తన 98వ యేటా సెప్టెంబర్ 28న చెన్నైలో కన్నుమూశారు. 1943లో బెంగాల్ కరవు వలన ఆహారం దొరకక మూడు మిలియన్ ప్రజలు చనిపోవడంతో ప్రభావితమైన స్వామినాథన హరిత విప్లవ పితామహుడైన మెక్సికాన్ వ్యవసాయ శాస్త్రవేత్త నార్మల్ బోర్లాగ్ మార్గంలోనే భారతదేశాన్ని కూడా ఆకలి పేదరికం నుండి విముక్తి చేయడానికి కృషి చేసిన వ్యవసాయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. భారతదేశం ఈ రోజు 317 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించిందంటే అది ఎంఎస్ స్వామినాథన్ వేసిన పునాదితోనే సాధ్యమైందని చెప్పాలి. నార్మల్ బోర్లాగ్ అధిక దిగుబడి నిచ్చే మిరాకిల్ వీట్ వరి వంగడాలు, హైబ్రిడ్ విత్తనాలు కనిపెట్టిన తరువాత అదే వరవడిలో వరి గోధుమ బంగాళదుంప జనపనార జన్యువులపై స్వామినాథన్ చేసిన పరిశోధనల ఫలితంగా భారతదేశం వ్యవసాయ ఉత్పత్తి ఉత్పాదకతలలో ప్రపంచ స్థాయి దేశంగా ఎదిగింది. హరిత విప్లవానికి పూర్వం భారత దేశం ఆహార కొరతను ఎదుర్కొంటున్న దేశాల జాబితా నుండి స్వయం సమృద్ధివైపు అడుగులు వేయడానికి స్వామినాథన్ పరిశోధనలే దోహదం చేశాయి. మద్రాస్ వ్యవసాయ కళాశాల నుండి వ్యవసాయ శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పొందిన స్వామినాథన్‌న్యూఢిల్లీ ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో



ఎం.ఎస్.స్వామినాథన్

మొక్కల పెంపకం, జన్యుశాస్త్రం లాంటి అంశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి 1950లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ప్లాంట్ బ్రీడింగ్ ఇన్స్టిట్యూట్‌లో పరిశోధనలు కొనసాగించాడు. భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రధాన కార్యదర్శిగా అంతర్జాతీయ పరిశోధనాసంస్థకి డైరెక్టర్ జనరల్‌గా కూడా స్వామినాథన్ సేవలు అందించారు. 2004లో వ్యవసాయరంగ సుస్థిరత, లాభదాయకత, వ్యవసాయరంగ అభివృద్ధి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకి పరిష్కారాల కోసం స్వామినాథన్ నేతృత్వంలో నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తన కమిషన్ రిపోర్టులో కనీస మద్దతు ధరలు రుణ మాఫీ పంట నష్టపరిహారం క్రెడిట్ పంటల బీమా లాంటి అనేక అంశాలపై సూచనలు చేశారు. వ్యవసాయ రంగంలో సంక్షోభం తలెత్తిన ప్రతి సందర్భంలో రైతులు, రైతు సంఘాలు స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారంటే స్వామినాథన్ సిఫారసులు ఎంత నిబద్ధతకలవో అర్థమవుతుంది. వ్యవసాయం పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి పట్ల అనేక సందర్భాల్లో స్వామినాథన్ తన అసంతృప్తిని తెలియచేశారు. ఇటీవల భారత ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ సాగు చట్టాలను కూడా వ్యతిరేకించి తన అభిప్రాయాలను రైతుల పక్షాన నిక్కచ్చిగా చెప్పే మనస్తత్వం స్వామినాథన్‌ది. తాను చేసిన సేవలకు గుర్తింపుగా రాజ్యసభ సభ్యునిగా అవకాశం పొందటమే కాదు పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ రామన్‌మెగాసెస్, ఇందిరాగాంధీ శాంతి బహుమతి , ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా అవార్డులుపొందారు. భారతరత్న అవార్డు పొందడానికి కూడా స్వామినాథన్ అర్హుడే. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వ్యవసాయరంగంపై చేపట్టిన భూసంస్కరణలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోయినా హరిత విప్లవం వ్యవసాయరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తేగలిగింది. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తిలో ఉత్పాదకతలో ఈ విప్లవాత్మకమైన మార్పులకు బీజంవేసింది స్వామినాథన్. తాను భౌతికంగా మరణించవచ్చు. కానీ ఆకలి, పేదరికాన్ని రూపుమాపాలనే అతని సంకల్పం గొప్పదిగానే కనబడుతుంది. ●

## ప్రజావాక్కు



### అమెరికన్లు గణితంలో వెనుకంజ

**గణితం** సబ్జెక్టులన్నింటిలో రాజువంటిది గణితం. అన్ని సబ్జెక్టులు గణితంతో ముడిపడి ఉంటాయి. అలాంటి గణితం అగ్రరాజ్యమైన అమెరికాను కలవరపెడుతోంది. దేశంలో గణితంలో నిష్ణాతులైన ఉద్యోగుల కొరత ఉందని పలు యూనివర్సిటీలు తమ నివేదికలో పేర్కొన్నాయి. ఇదే తీరు కొనసాగితే రాబోయే రోజుల్లోప్రపంచ ఆర్థికవ్యవస్థతో అమెరికాపోటీపడలేదని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో పలు కీలకరంగాలకు విదేశాల నుంచివిద్యార్థులుగా వచ్చి ఉద్యోగులుగా మారిన వారు నాయకత్వం వహిస్తున్నారని తేలింది. తాజా గణాంకాలప్రకారం అమెరికాలోని పలు యూనివర్సిటీలలో గణితం ఇంటెన్సివ్ సబ్జెక్టుగా కంప్యూటర్ సైన్స్ చదివే ప్రతి ఐదుగరిలో ఒక్కరు మాత్రమే అమెరికన్ ఉన్నారు.

-చల్లాచంద్రశేఖర్ రావు, కలువాయి, నెల్లూరుజిల్లా

### ప్రజాధనం వృధా!

**రాష్ట్ర** రాజధానిలో ఇళ్లస్థలాల పంపిణీకి రాష్ట్రపాలకులు కుటీల ఆలోచనలతో ప్రజాధనం వృధా తప్ప ఎటువంటి ప్రయోజనం లేదు. రాజధాని విశాఖ అంటారు. అమరావతిలో ఎటువంటి మౌలిక వసతులు లేకుండా ఉపాధి లేకుండా సెంటు స్థలం ఇచ్చి ఎవరిని మోసం చేస్తున్నారు. భూములు ఇచ్చిన రైతులకు కౌలు డబ్బులు కూడా ఇవ్వలేని దౌర్భాగ్యస్థితికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీసుకొచ్చారు. రాష్ట్ర హైకోర్టుకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు కూడా ఏర్పాటుచేయని పాలకులు పేదలకుస్థలం ఇవ్వడంవలన ఎటువంటి ఉపయోగం ఉండదు. నాలుగు సంవత్సరాలుగా దురాలోచనలతోపాలన సాగిస్తున్నారు. ప్రజావేదిక కూలగొట్టారు. కనీసం ఆ వ్యర్థాలను కూడాతొలగించలేదు. పాలకుల విధ్వంసాన్ని ప్రజలంతా అసహ్యించుకుంటున్నారు. పాలకులతీరుమారాలి. ప్రజల ఉపయోగపడేపథకాలు చేపట్టాలి.

-కె.కోటేశ్వరరావు, విశాఖపట్నం

### సాగునీటి వ్యవస్థను మెరుగుపరచాలి

**రాష్ట్రంలో** పెద్ద జలాశయాలనుంచి పంట కాలువల వరకు గత నాలుగు సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. వరదల్లో అన్నమయ్య డ్యాం కొట్టుకు పోయి 17నెలలు గడిచినా పాలకులు నిర్మాణం పనులు చేపట్ట కపోవడం పాలకుల చిత్తశుద్ధికి అద్దంపడుతున్నది. రాష్ట్రంలో వివిధప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల నిర్వహణ, అజమాయిషీ లేక మూతపడుతున్నాయి. రిజార్వయర్ల నుంచి పంట కాలు వల వరకు గేట్లు, షట్టర్లు, లాకులు తుప్పుపట్టి పనిచేయని స్థితిలోఉన్నాయి.

-జి.రాములు, కృష్ణాజిల్లా

### ప్రజా సమస్యలపై స్పందించాలి

**ఎలక్ట్రానిక్** మీడియా రంగంకాని, ప్రింట్ మీడియా రంగం కాని దశాబ్దాల కాలం క్రితంనాటితో పోలిస్తే ప్రస్తుతం చాలా వేగవంతంగా సమాచారాన్ని సేకరించగలుగుతోంది. ఒక పాతిక సంవత్సరాల క్రితం సమాచార వ్యవస్థ విస్తరించడానికి టెక్నాలజీ అందుబాటులో లేక చాలా అవరోధాలు ఉండేవి. సరైన రోడ్డు రవాణా లేక, సేకరించిన సమాచారాన్ని చేరవేసే అవకాశం లేక అత్యవసర వార్తలు కూడా వెంటనే ప్రసారం అయ్యేవి కాదు. ఆనాడు రేడియో వార్తలకు చాలా ప్రాధాన్యత ఉండేది. కానీ నేడు టెక్నాలజీ పెరిగి అన్ని రంగాలతోపాటు సోషల్ మీడియా విస్తృతంగా వాడకం పెరిగాక క్షణాల్లో ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా వెంటనే మీడియాకు అందుతోంది. ప్రస్తుతం వార్తలు ఎవరికైనాప్రతికూలంగా రాసినా, కేసులు, న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవల్సి వస్తుందనేది కూడా ఒక భయం. ఏదిఏమైనా గ్రామాల్లోను, చిన్న పట్టణాల్లోనూ జరుగుతున్న కష్టనష్టాలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, పిల్లలు, ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలు వెలుగులోకి రావడం లేదని, సామాన్య ప్రజానీకం క్షేత్రస్థాయిలో పడుతున్న అనేక ఇబ్బందులను అడ్రస్ చేయడంలేదని ప్రజల భావన.

-జోస్యుల వేణుగోపాల్, హైదరాబాద్

### నకిలీ వైద్యుల ఆటకట్టించాలి

**వైద్యులు** అందరూ కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న జాతీయ వైద్య కమిషన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా వారి పేరు, తండ్రి పేరు, వైద్యునిగా నమోదు తేదీ, వైద్య విద్యార్హతలు మొదలగు సమాచారం నమోదు చేసుకోవాలని, ప్రతీ ఐదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలని, అంతేకాక ఈవెబ్‌సైట్‌ని ప్రతీఒక్కరూ చూసుకోవచ్చుని, ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు జారీ చేయడం హర్షణీయం. ఇది దేశ ప్రజలందరికి చాలా ఉపయోగకరం. ఇలా చేయడం వలన నకిలీ వైద్యులను, ఆస్పత్రులను గుర్తించడం సులభమవుతుంది. ప్రజలకు మరిన్ని నాణ్యమైన వైద్య సేవలు లభ్యమవుతాయి.

-జి.మోహనరావు, శ్రీకాకుళంజిల్లా

### ప్రశ్నించేవారే లేరా?

**ప్రజావ్యతిరేక** నిర్ణయాల గురించి ప్రశ్నిస్తుంటే తిట్టడమనుకోకూడదు. కాని ప్రధాని మోడీ అలానే అనుకుంటున్నారు. తానేమీ చేసినా ఎవరూ అగడకూడదంటున్నారు. తననెవరూ ఏమీ అనకూడదంటున్నారు. అటుగుతుంటే తిడుతున్నారని వాపో తున్నారు. ఇదెక్కడి చోద్యం. మనం ఉన్నది ప్రజాస్వామ్య దేశంలోనేనా! లేక ఇతర దేశాల్లో ఉన్నామా?


-రాశి, హైదరాబాద్

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# బదలీలు సాగాలి, బడులు నిండాలి

వరగంటి అశోక్

మేం ఎన్నికల విధుల్లో ఉన్నాం. మమ్మల్ని వేరే చోటికి బదలీ చేయడం వల్లసాధారణ ఎన్నికల నిర్వహణకు ఆటంకం ఏర్పడుతుంది. కావున ఈ బదలీల ప్రక్రియను నిలుపుదల చేయాలి' అని కొంత మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. సీనియార్టీ జాబితాలో అనేక తప్పులున్నాయి. ఈ జాబితాలతో పదోన్నతులు నిర్వహిస్తే మాకు అన్యాయం జరుగుతుందని రంగారెడ్డి జిల్లాకు చెందిన కొందరు ఉపాధ్యాయులు న్యాయస్థానంలో కేసువేశారు. లోపాలను సవరించే వరకు పదోన్నతుల ప్రక్రియ చేపట్టరాదని వాదిస్తున్నారు. ఇవి అస్తిత్వవాద పోకడలు. తమ స్వార్థంకోసం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవస్థకు మేలు చేసే ప్రక్రియలకు సైతం ఆపేయాలని కోరడం అమానుషం, అహేతుకం. సంకుచితత్వ ధోరణులతో విద్యారంగానికి తీరని నష్టం చేకూర్చే ఇలాంటి కుట్రపూరిత చర్యలను ప్రతీ ఒక్కరు అడ్డుకోవాలి. ఉపాధ్యాయుల బదలీల వలన ఎన్నికల ప్రక్రియకు ఇబ్బందులు ఎదురవుతాయనుకుంటే దానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించే బాధ్యత ఎన్నికల కమిషన్‌ది. అవసరమైతే ఎన్నికలు పూర్తయ్యేవరకు ఉపాధ్యాయులందరినీ యధావిధిగా పాతస్థానాల్లోనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరే అవకాశం, అధికారం ఎన్నికల సంఘానికి ఉన్నది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థ అధికారాలను, విధులను కూడా తామే నిర్వహిస్తున్నట్లు నటించడం సదరు ప్రధానోపాధ్యాయులకు మంచిదికాదు. అలాగే సీనియారిటీ జాబితాలో లోపాలుంటే ఫిర్యాదుల ద్వారా వాటి సవరణకు అప్పీల్ చేసేఅవకాశం విద్యాశాఖ కల్పించింది. ఇది తెలిసి కూడా బదలీ ప్రక్రియకు ఆటంకం కలిగించాలని కొంత మంది ఉపాధ్యాయులు ప్రయత్నించడం అవివేకం. రాజధాని నగరానికి సమీపంలోని మొదటి కేటగిరి పాఠశాలల్లో పనిచేస్తున్న తాము బదలీల వల్ల నగరానికి దూరం కావాల్సి వస్తుందనే కోపంతో ఈ ప్రక్రియను ఆటంకపరిచే కుతంత్రాలివి. 23 శాతం హెచ్‌ఆర్‌ఏ కోల్పోవాల్సి రావడంతో ఇలాంటి చర్య లకు పాల్పడుతున్న వైనమిది. ఎంతో కాలంగా బదలీలు, పదోన్నతులు లేక నైరాశ్యంలో ఉన్న మెజారిటీ ఉపాధ్యాయుల ప్రయోజనాలకు అడ్డుకట్ట వేస్తున్న స్వార్థ చింతన ఇది. పదోన్నతుల వల్ల ఉపాధ్యాయులకు ఆర్థికంగా ప్రయోజనం, హోదాపరంగా ఉన్నతి చేకూరుతుందనేది వాస్తవం. అయితే దీనివల్ల ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు



ఉపాధ్యాయుల కొరత కూడా తీరుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 22వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు. ఖాళీగా ఉన్న 13,086 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. గత ఐదుసంవత్సరాలుగా విద్యా వలంటర్లను నియమించకపోవడం వల్ల సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. పదోన్నతుల వల్ల ఉన్నత పాఠశాలల్లోని ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఇక బదలీల్లో మెజారిటీ ఉపాధ్యాయులు తాము కోరుకున్న స్థానాలను పొందుతారనేది కూడా నిజమే. అయితే పాఠశాల మార్పు వల్ల ఉపాధ్యాయుల్లో మానసిక ఉల్లాసం పెరిగి, బోధనాపరమైన ఆసక్తి, నైపుణ్యం మెరుగవుతాయి. అంటే బదలీలు, పదోన్నతుల వల్ల అంతిమంగా విద్యార్థులకు, పాఠశాలలకు సమాజానికి మేలు జరుగుతుందనేది కాదనలేని వాస్తవం. అలాగే ఏర్పడిన ఖాళీల భర్తీ కోసం ఉపాధ్యాయ నియమకాల ప్రక్రియ చేపట్టడం మూలంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి. గత ఎనిమిది సంవత్సరాలుగా పదోన్నతులు లేవు. ఐదు సంవత్సరాలుగా బదలీలు లేవు. తెలంగాణరాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2015లో పదోన్నతులు, 2018లో బదలీలు నిర్వహించారు. కొన్నేళ్లుగా ఉపాధ్యాయ సంఘాలు అనేక పోరాటాలు, ప్రాతినిధ్యాలు చేసిన ఫలితంగా ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించి బదలీలు, పదోన్నతులకు అంగీకరించింది. జీవో ద్వారా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఫిబ్రవరి ఒకటినుండి షెడ్యూల్‌ను ప్రారంభించింది. జీవో 9 ద్వారా 317 కేటాయింపుల్లో వివిధ జిల్లాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయుల మినిమం సర్వీసుతో సంబంధం లేకుండా పాత సర్వీసులను పరిగణనలోకి తీసుకొని బదలీల్లో అవకాశం కల్పించింది. అయితే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ఫలితంగా 317 ఉపాధ్యాయుల ప్రయోజనార్థం వచ్చిన జీవో 9తో మిగిలిన బాధిత ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురించాయి. కోర్టు సహకారంతో తమ డిమాండ్లు నెరవేర్చుకునే అవకాశాల కోసం దారులు వెతికేవారు పెరిగిపోయారు. ఎట్టకేలకు ఆగస్టు30న బదలీల ప్రక్రియకు మార్గం సుగమం చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఇచ్చినతీర్పుతో ఉపాధ్యాయుల్లో మళ్లీ ఆశలు మొలకెత్తాయి. బదలీలు, పదోన్నతులను వ్యక్తుల ప్రయోజనాల దృష్ట్యా కాకుండా వ్యవస్థ కోణంలో చూడాలి. విద్యార్థుల భవిష్యత్తుకు ఇది బాటగా పరిగణించాలి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనగా భావించాలి. ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం తీసుకుంటున్న చర్యలుగా నమ్మాలి. ●

## జిల్లా ఎస్పీను కలిసిన మాజీ ఎమ్మెల్యే విశ్వ

- పుష్పగుచ్ఛం అందించి శుభాకంక్షలు

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త



జిల్లా ఎస్పీ కె.కె.ఎన్.అన్బురాజన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం జిల్లా ఎస్పీగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన కె.కె.ఎన్. అన్బురాజన్‌ను శుక్రవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే ఎస్పీకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల విషయాలపై వారు చర్చించారు.

## విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి



సమస్యలను పరిస్కరించాలని వినతి

కంబదూరు,సెప్టెంబర్ 29,ప్రభాతవార్త

కంబదూరు మండలం నూతిమడుగు బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఎదుర్కోంటున్న సమస్యలను సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సరిష్కరించాలని ఎస్సీ,ఎస్టీ,జేఏసి మండల అధ్యక్షుడు డాబా రమేష్ పేర్కోన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన జగనన్నకు సురక్ష కార్యక్రమంలో నూతిమడుగు గురుకుల పాఠశాల విద్యార్థులు శాశ్వత భవనాలు లేక రేకుల సేడ్‌లో చదువులు నేర్చుకుంటూ అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను సరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టరన కేతన్ గారగ్గకు డాబా రమేస్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగరాజు, ఎరుకుల సంఘం మండల అధ్యక్షులు సుబ్బరాయుడు, మారెన్న,నాగరాజు పాల్గొన్నారు.

## పెద్ద కౌకుంట్ల రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏవో

-అందుబాటులో రబీకు అవసరమైనన్ని ఎరువులు



పెద్దకౌకుంట్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంను తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి శుభకర్

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని పెద్దకౌకుంట్ల గ్రామంలోగల రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం మండల వ్యవసాయాధికారి జి.శుభకర్ తనిఖీ చేశారు. పంట నమోదులో భాగంగా రైతుల ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ జి.శుభకర్ మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమం ఈనెల 30వ తేదీతో ముగుస్తుందని ఇప్పటికీ ఎవరైనా రైతులు పంట నమోదు చేసుకోని యెడల వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ పంటకాలం ముగుస్తోందని రబీ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతు భరోసా కేంద్రాల్లో కావలసినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పప్పుశెనగ విత్తన పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని విత్తనం అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది నీలిమ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు

-ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో చెత్తాచెదారం శుభ్రం



ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రమదానం చేస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలి పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, పరిసరాల్లో చెత్తాచెదారాన్ని చీపుర్లుపట్టి శుభ్రం చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా నేరాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రిపుల్ యియియి శాఖాధిపతి వై.సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టండి

-ఇన్‌చార్జ్ సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్

పుట్టపర్తిరూరల్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ జిల్లా సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నందు రవాణ, పోలీస్, మెడికల్, మున్సిపల్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఎన్‌హెచ్ రోడ్లు, అధికారులు తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి రోడ్డు సేఫ్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత 6మాసాలలో రోడ్డు ప్రమాదాల నివారణకై తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ, కేంద్రం ప్రకటించిన గుడ్ సమారిటన్ స్కీం కింద ఏవైనా రోడ్డు ప్రమాదాలలో గాయపడ్డ వారికి సకాలంలో గోల్డెన్ హావర్‌లో ప్రాణాలు కాపాడే ప్రయత్నంచేసిన ఆసుపత్రులకు తరలించిన వారికి ప్రోత్సాహకంగా రూ.5 వేలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతత వ్యవహరించి ప్రమాద బాధితులకు అండగా నిలవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పిలుపునిచ్చారు. క్షతగాత్రులను చేర్చిన ఆసుపత్రులలో ప్రమాద బాధితుల వివరాలను చేర్చిన ఆసుపత్రులలో ప్రమాద బాధితుల వివరాలు, కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసి వరి ఐరాద్ (ఐఆర్ఎడి) యాప్‌లో నమోదు చేయడం ద్వారా జాతీయ స్థాయి వరకు ఈ వివరాలు అందుబాటులో ఖచ్చితత్వంతో ఉంటాయని సంబంధిత డాక్టర్లు దీనిపై పూర్తి అవగాహనతో ఉండాలని తెలిపారు. ఈ సంవత్సరం 9 నెలల కాలంలో ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 357 ప్రమాదాలు జరగగా అందులో 100 మంది మృతి చెందారని, 257 మంది గాయపడ్డారని, 25 శాతం దాకా గుఇర్తంచిబ్లాక్ స్పాట్‌లో ప్రమాదాలు జరుగుతున్నటుల రవాణ శాఖ నివేదిక ద్వారా తనకు తెలియవచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.ఎస్.వి.కృష్ణారెడ్డి, ఎంవిఐలువరప్రసాద్, శివశంకర్, రాణి, ఆర్‌టిసి జనరల్ మేనేజర్ మధు, ఎస్‌సిపిఆర్ గోపాల్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్లు తదితరుల పాల్గొన్నారు.

## సుడిగాలి పర్యటన నిర్వహించిన ఎమ్మెల్యే దుద్దుకుంట





కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, హాజారైన కార్యకర్తలు, నాయకులు

బుక్కపట్నం రూరల్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

బుక్కపట్నం మండల పరిధిలో పుట్టపర్తి శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శుక్రవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని కృష్ణాపురంలో వైసిపి కార్యకర్తలు నాయకులతో సమావేశమై పార్టీ విధివిధానాలపై చిర్చించారు. తరువాత మారాల, గసికవారిపల్లి, యాదాలంకపల్లి, తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అందించిన సేవలను ప్రతి పేదకు ఇంటి నుండి నిలువ నీడ కల్పించడమే మన జగనన్న ప్రభుత్వ లక్ష్యమని, ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని తెలియజేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పుట్టపర్తి నియోజకవర్గం వైఎస్ఆర్‌సిపి పార్టీ జెండాను ఎగురవేయాలని, ముఖ్యమైన కార్యకర్తల సమావేశం నిర్వహించి పార్టీ యొక్క విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీధర్ రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, జడ్పిటిసి గోవర్ధన్ రెడ్డి, ఎంపిటిసి,జడ్పిటిసిలు తదితర ముఖ్యమైన నాయకులు పాల్గొన్నారు.

## ఆమిద్యాలంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

-జ్వర పీడికతుల రక్తనమూనాలు సేకరించిన ఆరోగ్య సిబ్బంది



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.యండి.షఫీ

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో శుక్రవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ సీహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ షఫీ, సూపర్‌వైజర్ శేఖర్‌తో కూడిన ఆరోగ్య బృందం గ్రామంలో పర్యటించి ప్రజలకు సీజినల్ వ్యాధులపై అవగాహన కల్పించి దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ముఖ్యంగా పగలు కుట్టే టైగర్ దోమలవల్ల డెంగ్యూ జ్వరం వస్తుందని అన్నారు. దోమలు నీటిలో గుడ్లు పెట్టడంవల్ల అభివృద్ధి చెందుతాయని కనుక అనవసర నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి ఇంట్లోని నీటిని పారవేసి పాత్రలను శుభ్రంగా కడిగి ఆరబెట్టి కొత్త నీటిని పట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చాముండేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ భవాని, సీఓ భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామినాథన్ లేనిలోటు పూడ్చలేనిది

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త



స్వామినాథన్ చిత్రపటానికి పూలువేసి నివాళులర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.ఎం.చెన్నరాయుడు

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ వితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ లేనిలోటు పూడ్చ లేనిదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.ఎం.చెన్న రాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయన స్వామినాథన్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించారు. స్వామినాథన్ అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను సృష్టించి వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఆయన మరణం యావత్ రైతు లోకానికి పూడ్చలేని లోటన్నారు. భారతదేశం ఆహారం కోసం ఇతర దేశాలపై ఆధారపడే అవసరం లేకుండా ఆహారధాన్యాల స్వయం సంవృద్ధికి ఆయన చేసిన కృషి శ్లాఘనీయమన్నారు. నిరంతరం రైతాంగ సంక్షేమం కోసం పరితపించిన ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు.

## తిరుపతిలో రెండు మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణానికి 50 కోట్లతో టెండర్లు

### టిటిడి చీఫ్ ఇంజినీర్ ఉత్తర్వులు జారీ

**రాజంపేట అర్బన్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతిలో రెండు మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణానికి మొదటి అడుగు పడింది. పట్టణాభివృద్ధిలో భాగంగా కీలక రోడ్లను అభివృద్ధి చేసేందుకు తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పాలకవర్గం చేసిన కృషి ఫలించింది. టిటిడి నిధులతో రెండు కీలక రోడ్లను 49.50 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు తిరుపతి చీఫ్ ఇంజనీర్ శుక్రవారం టెండరు ఉత్తర్వులను జారీ చేశారు. తిరుపతి మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భాగంగా ఆర్‌టిఒ ఆఫీసు జంక్షన్ నుంచి కరకంబాడి -రేణిగుంట శ్రీ పద్మావతి ఫ్లోర్‌మిల్లు వరకు 80 అడుగుల రోడ్డును 2.90 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేసేందుకు 19.50 కోట్లతో టెండర్లు పిలిచారు. అలాగే పుద్దిపట్ల జంక్షన్ నుంచి జాతీయ రహదారి మీదుగా వకలుమాత ఆలయం వరకు 4 వరుసల రహదారిని 30 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. 2 రోడ్ల నిర్మాణాన్ని 12 నెలల్లోగా పూర్తి చేయాలని టిటిడి ఇంజనీరింగ్ విభాగం టెండరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఆపద వేళ జక్కంపూడి ఫౌండేషన్ సేవలు

### - బాలికను ఆదుకున్న డాక్టర్ వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ సెంటర్

**రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** ప్రాణాంతకమైన లుకేమియా వ్యాధితో బాధపడుతున్న 14 ఏళ్ల ఆలీషా ప్రవీణ పాట్నాకు చెందిన బాలికకు రాజమహేంద్రవరం దానవాయిపేటలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్ సెంటర్ నుంచి రక్తం సరఫరా చేసి బాలిక ప్రాణాలను రక్షించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. పాట్నాలోని లుకేమియా వ్యాధితో బాధపడుతున్న బాలికకు ప్రపంచంలో అత్యంత అరుదైన బ్లడ్ గ్రూప్ ఓప్లస్‌విఈ పాజిటివ్ బొంబాయి బెనెటిన్ గ్రూపునకు చెందిన రక్తం అవసరం అవ్వడంతో దేశంలో ఎక్కడా దొరక్కపోవడంతో
శాంతి బ్లడ్ సర్వీస్ ఆర గ్నైజర్ ద్వారా రాజమహేంద్రవరంలో ఉన్న జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ను సంప్రదించారు. తక్షణమే స్పందించిన ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, జాగృతి నాగేశ్వరరావు, ట్రస్టీ పట్నాయక్ తమ దగ్గర ఉన్న ఆ బ్లడ్ గ్రూప్ రక్తాన్ని తమ వ్యక్తిగత సిబ్బందితో ఫ్లైట్ ద్వారా పాట్నాకు పంపించారు.



## కోడి కత్తి కేసు విచారణ వచ్చే నెల 13కి వాయిదా

**విశాఖ క్రైం - ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కోడి కత్తికేసు మరోసారి వాయిదా పడింది. విశాఖపట్నంలోని ఎన్ఐఎ -ఎడిజే కోర్టులో శుక్రవారం కోడి కత్తి కేసుపై విచారణ జరగగా,న్యాయవాదుల వాదోపవాదాలను విన్న న్యాయస్థానం తదుపరి విచారణను వచ్చేనెల 13కి వాయిదా వేసింది. విచారణ నిమిత్తం నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావును పోలీసులు కోర్టుకు తీసుకొచ్చారు. ఈ కేసు విషయమై కోడి కత్తి కేసు నిందితుడు శ్రీనివాసరావు తరపు న్యాయవాది సలీం గతంలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌కచ్చితంగా కోర్టుకుహాజరుకావాలన్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో ఘటన జరిగిన రోజున వైఎస్సార్‌సీపీ నాయకులపై కూడా కేసు నమోదైందని గుర్తుచేశారు. కానీ, ఆ కేసుపై కోర్టులో విచారణ జరగడం లేదని వాపోయారు.న్యాయవాదిగా వైసీపీ నాయకులపై నమోదైన కేసుపై కూడా కోర్టులో విచారణ జరగాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ కోర్టుకు హాజరు కాలేని పక్షంలో ఎన్‌వోసి ఇవ్వాలనికోరారు. శ్రీనివాస్‌కు బెయిల్ ఇవ్వాలని కోర్టును కోరానన్న న్యాయవాది సలీం ప్రతివాదిగా ఉన్న సీఎం జగన్ నేరుగా కోర్టుకు హాజరు కాలేకపోతే,వీడియోమోడ్ ద్వారా విచారించాలనికోర్టును అభ్యర్థించినట్లు వెల్లడించారు.

## ఘనంగా మహాలయ పౌర్ణమి వేడుకలు



జోక్‌మార్క్ వద్ద పాటలు పాడుతూ పూజలు చేస్తున్న దృశ్యం

-వందల సంఖ్యలో తెగిన పొట్టేళ్లు, గొర్రెలు, మేకలు

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మహాలయ పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. గురువారం అర్ధరాత్రి మొదలు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని వీధుల్లో ప్రజలు పొట్టేళ్లు, గొర్రెలు, మేకలను కోసుకొని రాత్రికిరాత్రే వండుకొని ఆరగించారు. మాంసాహార భోజన ప్రియులు తెల్లవారుజాము మొదలు రోజంతా వివిద రకాల మాంసాహారాన్ని భుజించి విందులు చేసుకున్నారు. పౌర్ణమి సందర్భంగా పట్టణ, వివిద గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు జరుగగా సాంప్రదాయం ప్రకారం జోక్‌మార్క్‌ను ఊరేగించి పూజలు నిర్వహించిన అనంతరం ఎండిన కుంటల్లో వదిలేసి వచ్చారు. ఇలా చేయడంవల్ల సకాలంలో సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయని ప్రజల నమ్మకం.

## హంద్రీనీవా కాలువలో టీడీపీ జలదీక్ష..!

-చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్



హంద్రీనీవా కాలువలో జలదీక్ష చేస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా శుక్రవారం 17వ రోజు టీడీపీ నాయకులు మండల పరిధిలోని లత్తవరం గ్రామ సమీపంలోని హం ద్రీనీవా ప్రధాన కాలువలో జలదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సైకో పోవాలి.. సైకిల్ రావాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. చంద్రబాబు నిజాయితీ గల రాజకీయ నాయకుడని జగన్‌లా తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని లక్షకోట్ల రూపాయల కుంభకోణాలు చేయలేదని ఆయన కడిగిన ముత్యంలా బయటకు రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా నియంతృత్వ జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వామేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, మాజీ ఎంపీటీసీ సుంకన్న, వార్డు సభ్యుడు యం.రామాంజినేయులు, పాల గోవిందు, ఈడిగ వేణుగౌడ్, నిమ్మల ప్రసాద్, యం.వరప్రసాద్, వడ్డే లాలుస్వామి, తాజుద్దీన్, తెలుగు యువత నాయకులు మణిచౌదరి, పల్లా హరి, శంకర్‌నాయక్, విశ్వనాథ్‌గౌడ్, మహేష్, గురు, నూర్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కుమారస్వామి,ప్యారంభరత్,సుధాకర్ పాల్గొన్నారు.

## మలేరియా నిర్ధారణ ఆర్డీటీ కిట్ల పంపిణీ



మలేరియా నిర్ధారణ ఆర్డీటీ కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమీష్టిగా విజయవంతం చేద్దామని ఎంపీపీ చందా చంద్రమ్మ, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ పిలుపునిచ్చారు. శనివారం రోజు నుండి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాల్లో ప్రజలకు మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికిగాను వినియోగించి ఆర్డీటీ కిట్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. తకు ముందు ఎంపీడీఓ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పావని, డాక్టర్ వెంకటేష్‌నాయక్‌తో కలిసి పట్టణంలోని వివిధ సచివాలయాల పరిధిలోని కాలనీల్లో విస్తృతంగా పర్యటించి డ్రై డే ప్రాముఖ్యతను తెలియజేశారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జ్వరాల సర్వే నిర్వహించి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపాలని సూచించారు.

## అంబేద్కర్ బాలికల గురుకులంలో మేరి మట్టి..మేరి దేశ్

-స్వాతంత్ర్యం సాధించిన మహనీయుల చిత్రపటాలకు నివాళి



అంబేద్కర్ బాలికల గురుకులంలో జరిగిన మేరి మిట్టి మేరి దేశ్ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త



దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలోగల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం 'మేరి మట్టి..మేరి దేశ్' కార్యక్రమం నిర్వహించారు. దేశానికి స్వతంత్ర్యం సాధించిన మహనీయుల చిత్రపటాలను ప్రదర్శించి ప్రిన్సిపాల్ ఎన్.సునీత ఆధ్వర్యంలో వారికి నివాళులర్పించారు. ఈ సందర ్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని దేశం మనకేమిచ్చిందని ఆలోచించకుండా దేశానికి మనం ఏమిచ్చామని ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గుండెపోటు రావడానికి అతిపెద్ద కారణం మానసిక ఒత్తిడి..!

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ప్రముఖ సైకాలజిస్టు వై.సురేష్‌బాబు

మానసిక ఒత్తిడి ఎక్కువైతే గుండెపోటు వచ్చే అవకాశం అధికంగా ఉంటుందని ప్రముఖ సైకాలజిస్టు వై.సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ హృదయాన్ని ఉపయోగిం చండి.. హృదయాన్ని తెలుసుకోండి అన్న నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా వున్న ప్రతిఒక్కరికి వారి హృదయాలను జాగ్రత్తగా చూసుకోవడానికి ఒక రిమైండర్ కాల్ గా ప్రపంచ హృదయ దినోత్సవంను జరుపుకొంటున్నామన్నారు. ఒత్తిడి గుండె ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. గుండెపోటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ కనీసం రోజుకు 40 నిమిషాలపాటు నడవాలని, నూనె పదార్థాలను తక్కువగా భుజించాలని, చక్కటి నిద్ర, మంచినీటిని సరైన మోతాదులో తీసుకోవాలని, సమతుల్యముగా వ్యాయామం చేయాలని సూచించారు. 40 సంవత్సరాలు వయసు దాటిన ప్రతి వ్యక్తి లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు, 2డి ఎకో, ఈసీజీ పరీక్షలు చేయించుకొని అనుభవజ్ఞులైన కార్డియాలిస్టు (గుండె నిపుణులు)ను సంప్రదించి తగు సూచనలను తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అధిక ఒత్తిడి ఉన్నపుడు యోగా, ధ్యానం చేయాలని మంచి మిత్రులతో కాలక్షేపం చేయాలని వై.సురేష్‌బాబు సూచించారు.

## జిల్లా మహాజన జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్షునిగా యల్లంరాజు



నియామక పత్రాలను అందచేస్తున్న మందిక్రిష్ణ మాదిగ

కదిరి టౌన్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త : సత్యసాయి జిల్లా మహాజన జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్షునిగా యల్లం రాజును నియమిస్తూ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ నియామక పత్రాన్ని అందచేశారు. శుక్రవారం కడప జిల్లా కేంద్రంలో టిటిడి కళ్యాణమండపంలో విశ్వ రూప మహాపాదయాత్ర సన్నాహాక సదస్సుకు విచ్చేసిన మందక్రిష్ణ మాదిగ నియామక పత్రాన్ని అందచేసినట్లు యల్లంరాజు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావం నుంచి నేటి వరకూ ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాలు చేపట్టే కార్యక్రమాలు జాతికి విశేష సేవలు అందించినందుకు ఆయన సేవలను గుర్తించి జిల్లా మహాజన జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్షునిగా నియమించారన్నారు. జిల్లా మహాజన జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్షునిగా ఎంపికైన యల్లం రాజుకు ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్, కదిరి డివిజన్ కార్యదర్శి ప్రవీణ్, విద్యార్థి సంఘం నాయకులు పవన్‌కుమార్‌లు శుభాకాంక్షలు తెలియచేశారు.

## బాల్యవివాహాలపై అవగాహనా సదస్సు

కదిరి టౌన్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త : మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో బాల్యవివాహాలపై సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిడిపిఓ రాధిక మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై పూర్తి స్థాయిలో వివరించారు. గ్రామీణ స్థాయిలో కొందరికి తెలియక మరికొందరు పేదరికంతో మైనర్ బాలికలకు బాల్యవిహహాలు చేస్తున్నారని వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. క్షే త్రస్థాయిలో ప్రజలకు సచివాలయ పోలీసులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డిఎల్‌డిఓ సూర్యనారాయణ, ఎంపిడిఓ అంజినప్ప, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, సూపర్‌వైజర్ మమత, ఏంఈఓలు పాల్గొన్నారు.

## పంట నమోదు చేసుకున్న వారికే పరిహారం - ఏడిఏ సత్యనారాయణ




పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏడిఏ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త : రైతులు సాగు చేసిన పంట నమోదు(ఈక్రాప్ బుకింగ్) చేసుకున్న వారికే ప్రభుత్వ నుండి పరిహారం, ఇతర పథకాలు అమలు అవుతాయని కదిరి వ్యవసాయ శాఖ ఏడి సత్యనారాయణ, మండల వ్యవ సాయ అధికారి ఇలియాజ్ అహ మ్మద్‌లు రైతులకు తెలియ చేశారు. డబురువారిపల్లి, తిప్పేపల్లి గ్రామాలలో సాగు చేసిన వివిధ పంట లను శుక్రవారం పరిశీలించారు. డబురువారిపల్లిలో జగన్నాథ్‌రెడ్డి పొలంలో వేరున పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లా డుతూ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈకేవైసి చేయించు కోవాల న్నారు. పంట నమోదు చేసుకుంటే సాగు వివరాలు నమోదు చేయబడుతు ందని పంట నష్టపోయిన యెడల ప్రభుత్వం నుండి పరిహారం అందుతా యని సూచించారు. వీరి వెంట విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పవన్‌కు మార్, శ్రావణితో పాటు రైతులు ఉన్నారు.

## అక్టోబర్ 2న వైఎస్సార్ క్రికెట్ టోర్నీ ఫైనల్

ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త : పుట్టపర్తి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, సిఈసి సభ్యులు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని తనయుడు కొత్తకోట చక్రధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓడీసి మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలోని మైదానంలో గత 10 రోజులుగా వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ సాగుతోంది. ఇప్పటికే వివిధ జట్లు మధ్య సెమీఫైనల్స్ పోరుముగియడంతో అక్టోబర్ 2 న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సామల మోహన్‌రెడ్డి, లడ్డూ బాబ్జాన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. గాంధీ జయంతి రోజున బాబ్జాన్ ఎలెవెన్స్ వర్సెస్ కొండకమర్ల జట్లు పోరు సాగుతుందన్నారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు పుట్టపర్తిలో జరిగే అర్హత పోటీలో తలపడాల్సి ఉందన్నారు.

## మంచినీటి ట్యాంక్ చుట్టూ ఉన్న మురుకి నీరు



అపరి శుభ్రంగా ఉన్న మంచినీరు ట్యాంక్ పరిసరాలు

నంబులపూలకుంట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎదరుదొన పంచాయతీలోని దాసర వాండ్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు దగ్గరలో ప్రజలు నిత్యం నీళ్లు పట్టుకోవడానికి ఒక వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వాటర్ ట్యాంక్ చుట్టు నీరు నిలువ ఉండి పాచీ తయారై దోమలు ఉత్పత్తికి కారణం అవుతుంది. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దోమలు అధికమై డెంగ్యూ, మలేరియా వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయనీ, గ్రామంలో ఉన్న వైద్యాధికారులు ఈ ప్రాంతాన్ని బ్లీచింగ్ పౌడర్ చల్లకుండా ఇటువైపు కన్నెత్తి చూసిని పాపాన పోలేదు. ఇవిధంగా ఉంటే ప్రజలు రోగాల భారినపడే అవకాశాలు అధికంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలో నిరుని లువ ఉంచకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురిగినీరు నిలువ ఉండటం వల్ల దోమల ఉత్పత్తి అధికంగా ఉంటుందని ఫీవర్ సర్వే, మెడికల్ క్యాంప్‌లలో చెబుతున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్‌వద్ద మురికి నీరునిలువ ఉండకుండా శుభ్రం చేయాలని గ్రామ ప్రజలుకోరారు.

## సత్యసాయి జిల్లా మహాజన జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్షునిగా యల్లంరాజు



యల్లమరాజుకు నియామకపత్రాన్ని అందచేస్తున్న మందకృష్ణమాదిగ

అమడగూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా మహా జన జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షునిగా అమడగూరు మం డల కేంద్రానికి చెందిన యల్ల ంరాజును నియమిస్తూ నియా మకపత్రాన్ని మంద కృష్ణ మా దిగ అందచేశారు. ఈ కార్య క్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర అధ్య క్షులు విశ్వనాథ్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సురేష్, ఎంఎస్‌పి ప్రధాన కార్యదర్శి నరేంద్ర, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, సత్యసాయి జిల్లా ఎంఇఎఫ్ అధ్యక్షులు నాగేంద్రనాథ్, కదిరి డివిజన్ అదనపు కార్యదర్శి ప్రవీణ్, విద్యార్థి సంఘం నాయకులు పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలోని అభివృద్ధి పనులు పరిశీలించిన ఎంపీపి



పనులను పరిశీలిస్తున్న ఎంపీపి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త : మండలంలోని ఆకుతోటపల్లి వద్ద జగనన్న కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఇంటి నిర్మాణాలను ఎంపీపీ పర్వీన్‌భాను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపి మాట్లాడుతూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఓడీసి మండల 3250 జగనన్న గృహాలు మంజూరు చేయించారన్నారు. కాలనీల్లో విద్యుత్ లైన్లు, ల్యాండ్ లెవలింగ్ పనులు చేయించడం పూర్తిఅయిందన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవతం చేయాలన్నారు. ఎంపీపి వెంట సర్పంచ్ గోవిందు, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల షామీర్‌బాష, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల బాబా, వార్డు సభ్యుడు జమ్మలమడుగు జానీబాష, డీలర్ సూర్యనారాయణలు ఉన్నారు.

## మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష - ఎంపీపి తుమ్మల పర్వీన్‌భాను

ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త : మెరుగైన వైద్య సేవలు అందిచడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపి తుమ్మల పర్వీన్‌భాను పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపి నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలను అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పోరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు అన్ని సచివాలయ పరిధిలో ఉచిత క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించడం జరగుతుందన్నారు. నేడు(శనివారం) కొండకమర్లలో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. కావున ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె కోరారు.

## శ్రీకృష్ణుడికి పౌర్ణమి వేడుకలు



పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

నల్లచెరువు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని స్థానిక గీతా మందిర ం నందు శ్రీకృష్ణుడికి పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు దాదెం శివారెడ్డి, ఆలయ కమిటీ సభ్యుల అధ్ వర్యంలో ఉదయం ఆలయ అర్చకులు సుబ్రమణ్యం స్వామి, సురేష్ శర్మలు వేదమంత్రాలతో శ్రీకృష్ణుడికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు, ప్రత్యేక పుష్పాల తో అలంకరించడం జరిగింది. శ్రీకృష్ణ అష్టోత్తరాలు, నామ స్వరాలు, శ్రీకృ ష్ణ లీల గీతాలు,స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు తీర్థప్రసా దాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అన్నదాన కార్యక్రమానికి దామ జయరాంరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు దామ అమర్‌నాథ్‌రెడ్డిలు ఉభయదారులుగా వ్యవహరించి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అనంతరం స్వామివారి ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూచుపల్లి నరసింహారెడ్డి, భజనబృందం అధ్యక్షు లు సూర్యనారాయణ, మనీ నాయుడు, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన క్రీడా పోటీలు



క్రీడా పోటీలకు హాజరైన విధ్యార్థులు



క్రీడలలో పాల్గొన్న విధ్యార్థినీ, విధ్యార్థులు

నల్లచెరువు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీలలో అండర్-14, అండర్-17 విభాగాల నందు బాల బాలికలకు కబడ్డి, వాలీబాల్, కోకో, బాల్ బ్యాట్మింటన్, బ్యాట్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగ, అథ్లెటిక్స్ వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం మాజీ ఎంపిపి మాబు సాహెబ్ వారి ఆవరణంలో 100, 400, 800 మీటర్ల పరుగు పందెంలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీలలో కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాలకు సంబంధించి పాఠశాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో ముందు ఉండాలని, అదేవిధంగా నల్లచెరువు మండల కేంద్రంలో నియోజకవర్గ క్రీడా పోటీలు నిర్వహించామని, క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు.

## నేడు జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం



కదిరి ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి

గాండ్లపెంట,సెప్టెంబర్ 29,ప్రభాతవార్త: నేడు 30-09-23వ తేది శనివారం గాండ్లపెంట మండలం కటారుపల్లి సచివాలయ పరిధిలో జరుగు జగనన్న ఆరోగ్య కార్యక్ర మానికి కదిరి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొంటారు.కావున గాండ్లపెంట మండల ఎంపిఇప, జడ్పిటిసిలు,కో- అప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, జెసిఎస్ ఇంచార్జ్‌లు,వివిధ శాఖల చైర్మన్లు,రాష్ట్ర డైరెక్టర్లు,ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొనాలని మండల కన్వీనర్ గజ్జల రవీంద్రరెడ్డి కోరారు.

## బళ్లారి చేంబర్ సంస్థకు నూతన అధ్యక్షుడిగా మహారుద్రగౌడ - కార్యదర్శిగా సురేష్‌బాబు ఎంపిక



బళ్లారి చేంబర్ సంస్థకు నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు

బళ్లారి, సెప్టెంబర్29, ప్రభాతవార్త ; బళ్లారి జిల్లా చేంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ నూతన అధ్యక్షుడిగా బి.మహారుద్రగౌడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రానున్న మూడు సంవత్సరాల వ్యవధికిగానూ సంస్థ పదాధికారుల నియామకం జరిగింది. సంస్థ గౌరవ కార్యద ర్శిగా సురేష్‌బాబును ఎన్నిక చేశారు. సీనియర్ ఉపాధ్యక్షుడిగా యశ్వంత్‌రాజ్‌నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎ.మంజునాథ్, ఎస్.దొడ్డనగౌడ, జాయింట్ సెక్రటరీలుగా డా.మర్చేడు మల్లికార్జు నగౌడ, వి.రామచంద్ర, కోశాధికారిగా పి.పాలన్న ఎంపికయ్యారు. కార్యవర్గ సమితి సభలో సి.శ్రీని వాస రావు, మహారుద్రగౌడ, యశ్వంతరాజనాగిరెడ్డి, వి.రవికుమార్, ఎ.మం జునాథ్, కె.రమేష్, దొడ్డనగౌడ, సొంతగిరి ధర్, కె.సి.సురేష్‌బాబు, రామచంద్ర, నాగళ్లి రమేష్, సత్యబాబు, యు.గోవిందరెడ్డి, వేణుగోపా ల్‌గుప్త, ఆర్.నాగరాజ్, జి.రాఘవేంద్రరెడ్డి, వి.కె.ఎల్. దీపక్, సి.ఎస్. సత్యనారా యణ, జె.రాజేష్, నాగరాజ్‌నేకార్, టి.శ్రీనివాసరావు, ఎస్.జితేంద్రప్రసాద్, వి.వెంకటేష్‌లు తదితర సభ్యులు పాల్గొన్నారు.

## వెల్లుట్ల గ్రామాన్ని విజిట్ చేసిన పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్



పోస్టుమార్టం చేస్తున్న దృశ్యం



ప్లాస్టిక్ కవర్లు, డ్రిప్ వైర్లు వున్న దృశ్యం

పుట్లూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండలంలోని వెల్లుట్ల గ్రామంలో శరీర భాగాల్లో విషపదా ర్థాలు పేరుకపోయి పశువులు మృతి చెం దుతున్న క్రమంలో ఆ గ్రామాన్ని పశుసం వర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్రమణ్యం శుక్రవారం సందర్శించారు. చనిపోయిన ఆవుకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆవు పొట్టలో నుండి దాదాపు 10 కిలోల ప్లాస్టిక్ కవర్లు, డ్రిప్ పైపులు, ఇతర ప్లాస్టిక్ పదార్థాలను బయటకు తీశారు. మృతి చెందిన ఆవు యొక్క గుండె, కాలేయం, కిడ్నీ , ప్రేగులు, రక్తము, పేడ వంటి అనేక శాంపిల్స్‌ను తీసుకుని ప్రొద్దుటూరు, తిరుపతి వెటర్నరీ ల్యాబ్స్‌లకు, కర్ణాటకలోని పరీక్ష కేంద్రాలకు పంపుతామని జెడి సుబ్రమణ్యం తెలిపారు. కలుషితమైన నీరు, ఆహారం కారణంగా పశు వులు చనిపో తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడి రమేష్‌రెడ్డి, ఎడి ఖదీల్‌బాష, ల్యాబ్ టెక్నీషియన్లు, సిద్దిరామాపురం ఫామ్ సైంటిస్టు, సిబ్బంది పాల్గొన్నారు.

## బలవంతపు వసూళ్లు తగదు - ఎస్ఐ



హెచ్చరిస్తున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

యాడికి,

సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలో శుక్రవారం హిజ్రాలు పెద్దఎత్తున దుకాణాల వద్ద బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారంతో ఎస్ఐ గురుప్ర సాద్‌రెడ్డి స్టేషన్ ముందు హిజ్రాలతో మాట్లాడారు. దుకాణాల వద్ద బలవంతపు వసూళ్ల చేయడం చట్టరీత్యా నేరమని ఆ విధంగా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

**మద్యం సేవించిన వాహనదారులపై కేసు నమోదు :**

మండలంలోని రాయలచెరువు గ్రామంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ఇరువురిపై, మద్యం సేవించి వాహనాలు నడిపే మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రాయలచెరువులో గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ అలెగ్జాండర్

యాడికి,

సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచు తలారి అరుణ ఆధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీలో రైల్వే గేటు వద్ద రైల్వే అధికారులు బ్రిడ్జి నిర్మిస్తారని పేర్కొ న్నారు. గ్రామ పంచాయతీలో జరుగు అభివృద్ధి కార్యక్రమాలు, పలు సంక్షేమ కార్యక్రమాల గురించి సర్పంచు అధ్యక్షతన విశదీకరించారు. ఈ కార్య క్రమంలో తహశీల్దార్ అలెగ్జాండర్, వైస్ ఎంపిపి హసీనాబేగం, మాజీ జెడ్‌పిటిసి వెంకటరామిరెడ్డి, వైస్‌ఎంపిపి-2 చెన్నప్ప, వైసిపి నాయకులు, ఆర్ఐ ఆనంద్‌బాబు, పంచాయతీ కార్యదరి ్శ సాయి అరుణ్‌కుమార్, విఆర్‌ఓలు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## తక్కళ్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

పుట్లూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మలడలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 15 రోజుల నుండి వాలంటీర్లు, హెల్త్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి, వివిధ రకాల పరీక్షలు చేశారని ఎంపిడిఓ యోగానందరెడ్డి తెలిపారు. చికిత్స అవసరం వున్న వ్యక్తులకు టోకెన్లు జారీ చేశారు. వారందరూ కూడా రేపటి రోజు వారికి ఇచ్చిన టోకెన్‌తో పాటు ఆరోగ్యశ్రీకార్డు, ఆధార్‌కార్డు తీసుకుని గ్రామ ఆరోగ్య క్లీనిక్ వద్ద నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరై డాక్టర్లతో పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. టోకెన్ లేని వారు పరీక్షలు చేయి ంచుకో వచ్చన్నారు. ఈ కార్యక్రమానికి జనరల్ సర్జన్ ప్రభాకర్ నాయుడు, గైనకాలజిస్టు గంగన్న, ఇద్దరు ఎంబిబిఎస్ డాక్టర్లు హాజరవుతారన్నారు. కావునా తక్కళ్లపల్లి, గాండ్లపాడు గ్రామ పంచాయతీల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## పుట్లూరులో మేరీ మట్టి..మేరీ దేశ్



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ, హెచ్‌ఎం, తదితరులు

పుట్లూరు,

సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం మేరీ మట్టి..మేరీ దేశ్ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ శ్రీదేవి హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి దేశ నాయకుల చిత్రపటాలు, మట్టి కలశాలను చేతబూని ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ సర్కిల్‌లో మాన వహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. దేశ ఔన్న త్యాన్ని చాటేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వారు తెలియచేశారు.

## రేషన్ డీలర్ల సమావేశం



రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

యల్లనూరు,

సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ సుమతి ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లా డుతూ రేషన్ బియ్యం ప్రజలకు సకాలంలో అందించాల్సిన బాధ్యత మనపై వుందన్నారు. రేషన్ బియ ్యం అందిస్తున్న వాహన దారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ అందేలా చూడాలని రేషన్ డీలర ్లకు సూచించారు. ఈ కార్య క్రమంలో సిఎస్‌డిటి ఇంతియాజ్, సీనియర్ అసిస్టెంట్ వాసుదేరావు, డీలర్లు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతదీక్ష



వాసవిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి,

సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వాసవిమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర యంలో శుక్రవా రం శ్రీసత్యనా రాయణ స్వామి వ్రతదీక్ష నిర్వహించారు. 11 మంది దంపతుల చేత ఘనంగా ఈ వ్రత దీక్ష నిర్వహించారు. ఈ వ్రత దీక్షలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసా దాలను పంపి ణీ చేశారు. అమ్మవారి ఆలయంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వెండి చీరతోను, పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తాగునీటి ట్యాంకు ప్రారంభం



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు

యాడికి,

సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండలంలోని చింతలాయపల్లి గ్రామంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన 3 తాగునీటి ట్యాంకులను మండల కన్వీనర్ బొ ంబాయి రమేష్‌నాయుడు, ఉపసర్పంచు కాసా చంద్రమోహన్‌లు ప్రారం భించారు. అనంతర ం గ్రామంలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయం, శ్రీగంగమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాగునీటి ట్యాంకు ఏర్పాటుతో చింతలాయపల్లిలో తాగునీటి ఎద్దడికి తెరపడిందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంపిటిసి అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, మధుసూదన్‌రెడ్డి, పేరం దేవేందర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గంగరాజు, మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కరవు ప్రాంతంగా ప్రకటిస్తే చాలదు... పరిహార కార్యం చేపట్టండి - సంయుక్త పోరాట కర్ణాటక జిల్లాసమితి నాయకుల డిమాండ్



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న రైతుసంఘాల నాయకులు

బళ్లారి, సెప్టెంబర్29, ప్రభాతవార్త ; రాష్ట్ర ప్రభుత్వం కరవు పీడిత జిల్లాల జాబితాలో బళ్లారిని ప్రకటించారని, అయితే ఇంతవరకు ఎటువంటి పరిహార కార్యాలు చేపట్టలేదని, కరవుపీడిత ప్రాంతంగా ప్రకిస్తే చాలదు ప్రభుత్వం పరిహార చర్యలు చేపట్టి రైతుల్ని ఆదుకోవాలని వివిధ రైతు సంఘాల సంయుక్త పోరాట కర్ణాటక బళ్లారి జిల్ల సమితి నాయకులు డిమాండ్ చేశారు. బళ్లారిలో పత్రికాభవన్‌లో శుక్రవారంనాడు మాట్లాడిన వారు వర్షాభావంతో జిల్లావ్యాప్తంగా రైతుల పంటలు చేతికిరాక అపారనష్టానికి గురయ్యారు. వరుసగా మూడోసారి రైతులు అతివృష్టి, అనావృష్టికి గురై కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని, రైతులపట్ల నిర్లక్ష్యం వీడి తక్షణమే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిహార చర్యలు చేపట్టాలని చెప్పారు. జిల్లా యంత్రాంగం ఈ దిశలో ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం చూస్తే ప్రభుత్వం అసమర్థత ఏమిటో తెలుస్తున్నదని తెలిపిన రైతుసంఘం నాయకుడు వి.ఎస్.శివశంకర్ పరిహార కార్యాలు చేపట్టకపోవడంతో చిన్నపాటి రైతులు, వ్యవసాయ కూలీలు బెంగళూరు తదితర చోట్లకు వలస వెళ్లే పరిస్థితి నెలకొంది. తక్షణమే ఉద్యోగఖాత్రి యోజనను జారీలోకి తీసుకొచ్చి వలస వెళ్లకుండా 200 మానవ పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కరవుపీడిత ప్రాంతంగా బళ్లారి జిల్లాను ప్రకటించినా బ్యాంకుల అధికారులు రుణాల వసూళ్ల కోసం రైతుల్ని వేధిస్తున్నారని తెలిపిన ఆయన కరవు కాలంలో చేతికి పంటలు రాక ఆందోళన చెందుతున్న రైతుల వద్దకు బ్యాంకు అధికారులు రుణాలు తీర్చాలంటూ పీడిస్తున్నారని, నోటీసులు సైతం అందజేస్తున్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని బ్యాంకులకు రైతులపై ఒత్తిడి తీసుకురావొద్దని ఆదేశాలు జారీ చేయాలని చెప్పారు. కరవు కారణంగా జాతీయ బ్యాంకుల్లో, సొసైటీల్లో రైతులు తీసుకున్న రుణాలకు సంబంధించి బకాయిలను తక్షణమే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పశుపక్షాదులకు పశుగ్రాసం కొరత ఉన్నదని, తక్షణమే ఆయా తాలూకా కేంద్రాల్లో పశుగ్రాసం కేంద్రాలు స్థాపించి రైతుల్ని ఆదుకోవాలని, రైతులకు జిల్లా యంత్రాంగంచే ప్రత్యేక పరిహార కార్యాలను వెంటనే చేపట్టాలని చెప్పారు. ఈ సందర్భంలో రైతుసంఘాల నాయకులు సంగనకల్ క్రిష్ణప్ప, గురల్లి రాజా, గోవిందు, ఈశ్వరప్ప, లేపా క్షి, ఉజ్జనయ్య తదితరు లు పాల్గొన్నారు.

## కర్ణాటక బంద్... బళ్లారిలో కనిపించని ప్రభావం - యదావిధిగా నడిచిన స్కూళ్లు, కాలేజీలు, షాపులు, హోటళ్లు, బస్సుల సంచారం



బళ్లారిలో బంద్ ప్రభావం లేకపోవడంతో వాహనాల రాకపోకలతో సందడిగా కనిపిస్తున్నప్పటి దృశ్యం



బళ్లారి, సెప్టెంబర్29, ప్రభాతవార్త ; తమిళనాడుకు కావేరీ జలాలు విడుదల ఖండిస్తూ కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రజాసంఘాలు, కన్నడపర సంఘసంస్థలు, రైతుసంఘాలు పిలుపునిచ్చిన కర్ణాటక బంద్ బళ్లారిలో ఎటువంటి ప్రభావం చూపలేదు. యదావిధిగా దిననిత్య కార్యకలా పాలు కనిపించాయి. స్కూళ్లు, కాలేజీలు తెరవడంతో విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. అంగళ్లు, హోటళ్లు తెరవడంతో పాటు బస్సుల సంచారం వాహనాల రాకపోకలతో నగరంలోని రోడ్లన్నీ జనం సందడితో కనిపించడం విశేషం. జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్‌బండారు గురువా రంనాడు జారీ చేసిన పత్రికా ప్రకటనలో బలవంతంగా ఎవరూ షాపుల్ని, హోటళ్లను బంద్ చేయకూడదని, సార్వజనికుల ఆస్తిపాస్తులకు భంగం కలుగజేస్తే పోలీసు లు చర్యలు తీసుకుంటారని ప్రకటన జారీ చేయడంతో శుక్రవారంనాడు తమ కార్యకలాపాలను సార్వజనికులు కొనసాగించారు. స్థానిక కన్నడ సంఘాలకు చెందిన కార్యకర్తలు తమ పోరాటం నేపథ్యంలో కర్ణాటక బంద్‌కు తమ మద్దతు వ్యక్తం చేసి వివిధ కూడళ్లలో చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కావేరీ జలాలు తమిళనాడుకు వదలకుండా రాష్ట్ర ప్రభుత్వం బంద్ చేయాలని డిమాండ్ చేశారు. కేఎస్‌ఆర్‌టీసీ డిపో నుంచి ఉదయం 5;30 గంటల నుంచే బస్సుల సంచారం మొదలవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాం డులో తమ ప్రాంతం బస్సుల కోసం వేచి చూస్తూ కనిపిం చారు. థియేటర్‌లలోనూ సినిమా ప్రదర్శ నలు కొనసాగాయి. కర్ణాటక బంద్ నేపథ్యంలో కర్ణాటక రక్షణవేదికకు చెందిన వందలాది మంది కార్యకర్తలు స్థానిక రాయల సర్కిల్‌లో తమిళనాడు సీఎం స్టాలిన్ దిష్టిబొమ్మను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. వేదిక జిల్లా నాయకుడు రాజశేఖర్ నేతృత్వంలో కార్యకర్తలు కురిహట్టి నుంచి బైకు ర్యాలీ జరిపి రాయలసర్కిల్‌లో వారు ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయానికి చేరుకొని వినతి పత్రం అందజేశారు.

# వన్డేవరల్డ్‌కప్‌తో ఆర్థికవ్యవస్థకు 13వేల కోట్ల రాబడి




న్యూఢిల్లీ: భారత్‌లో అక్టోబరు ఐదునుంచి ప్రపంచకప్ ప్రారంభం అవుతుంటే ఈ మెగా టోర్నీ నిర్వహణ వల్ల భారత క్రికెట్‌మండలికి నష్టం వస్తుంటే భారత్‌లోని టోర్నీ మార్కెట్‌కు మాత్రం వేలకోట్లు లాభం వస్తోందని తెలుస్తోంది. వన్డే వరల్డ్‌కప్ 2023కి ఆతిథ్యంకోసం సుమారు రెండువేల కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఇందులో రూ.1500 కోట్లను బిసిసిఐ భరిస్తుంది. హోస్టింగ్ ఫీజురూపంలోరూ.200 కోట్లనుసైతం బిసిసిఐ ఐసిసికి చెల్లిస్తుంది. అంతేకాకుండా భారత ప్రభుత్వానికిరూ.936 కోట్ల రూపాయలు పన్నులురూపంలో చెల్లించాలి. టికెట్లఅమ్మకాలు, ప్రసార హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు తదితరరూపాల్లో బిసిసిఐకి ఆదాయం సమకూరుతుంది. అయినా బిసిసిఐకి భారీగానే నష్టం వాటిల్లనుంది. వరల్డ్‌కప్ నిర్వహణద్వారా బోర్డుకువచ్చే నష్టం రూ.955 కోట్లు అని అంచనా. దీనితో పన్ను మినహాయించాలని బిసిసిఐ ప్రభుత్వాన్ని కోరనున్నది. ప్రపంచకప్ ద్వారా భారత ఆర్థికవ్యవస్థకు రూ.13,500 కోట్లు ప్రయోజనం కలుగుతుందని బిక్యూప్రైమ్ రిపోర్ట్ నివేదిక విడుదలచేసింది. మ్యాచ్‌లుచూసేందుకు విదేశాలనుంచి కూడా ఫ్యాన్స్ వస్తున్నారు. విమాన టికెట్లు, హోటల్‌గదులు, క్రికెట్ మ్యాచ్‌ల టికెట్లు రూపంలో భారీ ఆదాయం వస్తోంది. విమానయానం, ఆతిథ్యరంగాలకు భలే గిరాకీ ఏర్పడింది. వీటన్నింటివల్ల భారత ఆర్థిక వ్యవస్థకు 13,500 కోట్లు లాభం కలుగుతుందని అంచనా.

భారత్‌లో పర్యాటకంపైనే 5705 కోట్లవరకూ విదేశీ ఫ్యాన్స్‌నుంచి రాబడులు అందుతాయని అంచనా. 2015లోప్రపంచకప్‌కి ఆస్ట్రేలియా న్యూజిలాండ్‌లు ఆతిథ్యం ఇస్తే ఆదేశాల ఆర్థికవ్యవస్థకు 347 మిలియన్ డాలర్లమేర లబ్ధికలిగింది. 2019లో ఆతిథ్యం ఇచ్చిన ఇంగ్లండ్ మార్కెట్‌కు 447.8 మిలియన్ డాలర్ల లబ్ధిచేకూరింది. మార్కెట్‌కు ఏకంగా 1.6 బిలియన్ డాలర్లమేర ప్రయోజనం ఉందని అంచనావేసింది.



# ఆసియా క్రీడలకు బయలుదేరిన క్రికెట్‌టీమ్

**హ్యాంగ్జౌ:** చైనాలోని హ్యాంగ్జౌనగరంలో జరకుగుతున్న ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ జట్టు రెడీ అవుతోంది. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలోని భారత పురుషుల క్రికెట్‌జట్టు చైనాలోని హ్యాంగ్జౌ నగరానికి చేరుకుంది. ఇప్పటికే ఈ క్రీడల్లో హర్మన్‌ప్రీత్‌కౌర్ ఆధ్వర్యంలోని మహిళల జట్టు గోల్డ్‌సాధించింది. ఇతర క్రీడల్లోకూడా భారీ క్రీడాకారులు పతకాలనుసాధిస్తున్నారు. ఆసియా క్రీడల్లో చాలా ఏళ్ల తర్వాత క్రికెట్‌ను మళ్లీచేర్చారు. మహిళల జట్టు పూర్తిస్థాయి జట్టును పంపించ్చడంతో ఆ జట్టు గోల్డ్ కొట్టింది. ఇక గైక్వాడ్ ఆధ్వర్యంలోని ద్వితీయశ్రేణి జట్టును బిసిసిఐ ఏసియన్‌గేమ్స్‌కనఓసం ఎంపిక చేసింది. జాతీయ క్రికెట్ అకాడమీ చీఫ్ వివిఎస్ లక్ష్మణ్ ఈ జట్టుకు హెడ్‌కోచ్‌గా ఉన్నాడు. ఐసిసి ర్యాంకింగ్స్‌తో ఈటోర్నీలో భారత జట్టు నేరుగా క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. భారత్‌తోపాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లు కూడా క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరాయి. గ్రూప్‌దశ మ్యాచ్‌లు అక్టోబరు రెండుతో ముగుస్తాయి. భారత్ తన తొలిమ్యాచ్‌ను అక్టోబరు 3న ఆడనుంది. ప్రత్యర్థి ఎవరనేది ఇంకా డిసైడ్‌కాలేదు. టి20 ఫార్మాట్‌లో పోరు జరుగుతుంది. ఈమ్యాచ్ గెలిస్తే భారత్ సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. అక్టోబరు ఆరున సెఫైనల్, ఫైనల్‌మ్యాచ్ అక్టోబరు ఏడున జరుగుతుంది. ఈమ్యాచ్ గెలిచిన జట్టు స్వర్ణపతకం సాధిస్తుంది. రన్నరప్ టీమ్‌కు రజతపతకం దక్కుతుంది. మూడోప్లేస్‌కోసం జరిగే మ్యాచ్‌లో విజేతగా నిలిచిన జట్టుకు కాంస్యపతకం లభిస్తుంది. జట్టులో రుతురాజ్‌గైక్వాడ్, యశస్విజైస్వాల్, రాహుల్‌త్రిపాఠి, రింకూసింగ్, తిలక్‌వర్మ,జితేష్‌శర్మ, వాషింగ్టన్‌సుందర్, షాబాజ్ అహ్మద్; రవిబిష్ణోయ్, ఆవేశ్‌ఖాన్, అర్షదీప్‌సింగ్; ముకేష్‌కుమార్, శివంమావి, శివందూబే, ప్రభ్‌సిమ్రన్ సింగ్ లు జట్టుసభ్యులుగా ఎంపికయ్యారు.

# 38గంటలు ఎకానమీ క్లాస్‌లో నరకం!

## ఇంగ్లండ్ క్రికెటర్ జానీ బెయిర్‌స్టో



**గువాహాటి:** ప్రపంచకప్‌కోసం ఇంగ్లండ్‌క్రికెట్‌జట్టు భారత్‌కు చేరింది. గువాహాటి వేదికగా టీమిండియాతో వార్మప్ మ్యాచ్‌లో తలపడుతోంది. జట్టుప్రయాణంపై మాత్రం జానీ బెయిర్‌స్టో తీవ్ర అసహనం వ్యక్తంచేసాడు. దాదాపు 38 గంటలపాటు ఎకానమీక్లాస్‌లోనేప్రయాణించినట్లు వెల్లడించాడు. తనను అయోమయానికి గురిచేసిందన్నాడు. అంతా గందరగోళంగా మారింది. విమానం లోకి ప్రవేశించాక దాదాపు 38గంటలకు పైగా ప్రయాణం సాగిందని బెయిర్‌స్టో ఇన్‌స్టాస్టోరీపోస్టుచేసాడు. ఇమేజ్‌లో కెప్టెన్ జోస్ బడట్లర్, వోక్స్‌లుకూడా కనిపించారు. వారిద్దరితోపాటు ఇతరప్రయాణీకులు కూడా ఉన్నారు. తాజాగా గువాహటికి భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు చేరుకున్నారు. శనివారం రెండుదేశాలమధ్య వార్మప్ మ్యాచ్ జరుగుతుంది. ఇంగ్లండ్ ఆటగాళ్లు మొయిన్ ఆలీ, ఆదిల్‌రషీద్, జోరూట్., బెన్‌స్టోక్స్‌తోపాటు సహాయక కోచింగ్ సిబ్బంది జట్టుకోసం కేటాయించిన బస్సులో హోటల్‌కుచేరారు. ఇంగ్లండ్ జట్టులో జోస్ బట్లర్, మొయిన్ ఆలీ, గ్యాస్ అట్కిన్‌సన్, జానీ బెయిర్‌స్టో, హ్యారీబ్రూక్, సామ్‌కరన్, లియామ్ లివింగ్‌స్టోన్, డేవిడ్ మలన్, ఆదిల్‌రషీద్, జోరూట్, బెన్‌స్టోక్స్, రీస్‌టోప్లే, డేవిడ్‌విల్లే, మార్క్‌వుడ్, క్రిస్ వోక్స్‌లున్నారు.



# తొలిమ్యాచ్‌కు ఆసీస్ కెప్టెన్ దూరం?

**అహ్మదాబాద్:** గతప్రపంచకప్‌కు రన్నరప్‌లుగా నిలిచిన న్యూజిలాండ్‌కు ఈ ప్రపంచకప్ ఆరంభంలో షాక్ తగిలింది. అహ్మదాబాద్‌లో జరిగే వరల్డ్‌కప్ తొలిమ్యాచ్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ఆడటంలేదని తేలింది. ఈ ఏడాదిజరిగిన ఐపిఎల్ తొలిమ్యాచ్‌లోనే బౌండరీవద్ద విలియమ్సన్ గాయపడిన సంగతి తెలిసిందే. ఈగాయం వల్ల ఇప్పటివరకూ విలియమ్సన్ పెద్దగా క్రికెట్ ఆడలేదు. మళ్లీగ్రౌండ్‌లోకి వచ్చిన ఆతడిని ప్రపంచకప్ కోసం ఎంపికచేసారు. గత వరల్డ్‌కప్‌లో ఫైనల్ వరకూవెళ్లిన కివీస్ ఇంగ్లండ్‌చేతిలో ఓటమి చెందింది. ఆమ్యాచ్ సూపర్ ఓవర్‌కూడా డ్రా కావడంతో ఎక్కువ బౌండరీలు కొట్టిన జట్టును విజేతగా ప్రకటించారు. ఈసారి కూడా ఈ రెండుజట్లమధ్యనే పోటీ ఆరంభం అవుతోంది. ఇలా ఒక టీమ్ పర్మనెంట్ కెప్టెన్ గతంలో వరల్డ్‌కప్‌లో తొలతిమ్యాచ్‌ను మిస్ అయినపుడు అదే కెప్టెన్ చివరికి ట్రోఫీ నెగ్గాని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతు న్నారు. 2015లో అప్పటి ఆసీస్‌కెప్టెన్ మైకేల్‌క్లార్క్ ఆ ఏడాది వరల్డ్ కప్‌తొలిమ్యాచ్ మిస్ అయ్యాడు. చివరకు ఆతని కెప్టెన్సీలో ఆసీస్ ఆ వరల్డ్‌కప్ ట్రోఫీ ఆడింది. ఇదే విషయం చెపుతున్న అభిమానులు ఈసారి ఆ సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందని చెపుతున్నారు.

# ప్రపంచకప్ కామెంటేటర్లనుప్రకటించిన ఐసిసి



**దుబాయి:** భారత్ వేదికగా జరిగే వన్డే వరల్డ్‌కప్‌కు అంతర్జాతీయ క్రికెట్‌మండలి వ్యాఖ్యాతల పేర్లను ప్రకటించింది. 31 మంది సభ్యులతోకూడిన వ్యాఖ్యాతల వివరాలను శుక్రవారంప్రకటించింది. ఈప్యానెల్‌లోభారత్; ఆస్ట్రేలియా, పాకిస్థాన్, న్యూజిలాండ్ దేశాలకు చెందిన దిగ్గజ ఆటగాళ్లు ఉన్నారు. భారత్‌ఖుంచి ఆరుగురికి మాత్రమే ఈసారి ఛాన్స్ లభించింది. టీమిండియా దిగ్గజ క్రికెటర్లు రవిశాస్త్రి, సునీల్ గవాస్కర్‌లతోపాటు దినేశ్‌కార్తీక్, సంజయ్ మంజ్రేకర్, అంజుమ్ చోప్రా, హర్షాభోగ్లే ప్రపంచకప్ వ్యాఖ్యాతల జాబితాలో ఉన్నారు.

టీమిండియా మాజీ ఓపెనర్ బిజెపి ఎంపి గౌతమ్ గంభీర్‌కు క్యామెంట్రీ ప్యానెల్ ఛాన్స్ రాలేదు. న్యూజిలాండ్‌నుంచి ఇయాన్ స్మిత్, సౌమన్ డౌల్, కేటీ మార్టిన్‌లకు ఛాన్స్‌వస్తే ఇంగ్లండ్‌నుంచి ఇయాన్‌మోర్గాన్, నాసర్ హుస్సేన్, మైఖేల్ ఆథర్టన్, మార్క్ నికొలస్; ఇయాన్ వర్డ్ ఉన్నారు. పాకిస్థాన్‌నుంచి రమీజ్‌రాజా వకార్‌యూనిస్ అథర్ ఆలీఖాన్, వెస్టిండీస్‌నుంచి ఇయాన్ బిషప్, శామ్యూల్‌బద్రి, దక్షిణాఫ్రికానుంచి షాన్ పోలాక్, కస్తూరినాయుడు, నటాలీ జెర్మనోస్; జింబాబ్వేనుంచి ఎంపులలో ఎంబాంగ్వా, శ్రీలంకనుంచి రెసెల్ ఆర్నాల్డ్ కామెంట్రీ జాబితాలో చేరారు. వార్మప్ మ్యాచ్‌లనుంచే బాధ్యతలు స్వీకరించనున్నారు. ఐదునుంచి మెగా టోర్నీ షురూ అవుతుంటే తొలిమ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్, రన్నరప్ న్యూజిలాండ్‌లు తలపడుతున్నాయి.

# బంగ్లా క్రికెటర్లమధ్య రాజుకున్న చిచ్చు



**ఢాకా:** వన్డే వరల్డ్‌కప్ పుణ్యమా అని క్రికెటర్లమధ్యకూడా గొడవలు పెరిగిపోతున్నాయి. బంగ్లా జట్టులో ఇదే జరుగుతోంది. ఆ టీమ్ వెటరన్ బ్యాటర్ తమీమ్ ఇక్బాల్, కెప్టెన్ షకీబల్ హాసన్‌లమధ్య ఉప్పునిప్పుగా వ్యవహారం కొనసాగుతోంది. ఆసియాకప్‌కు కొన్నిరోజుల ముందే జెట్టు కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పిన తమీమ్ క్రరికెట్‌నుంచి కూడారిటైర్మెంట్ తీసుకున్నాడు. తమీమ్ మళ్లీ యూటర్న్ తీసుకుని ఆసియాకప్ ఆడకపోయినా ప్రపంచకప్‌లో ఆడతాడని అంతా భావించారు. అయితే టోర్నీలో కేవలం నాలుగైదు మ్యాచ్‌లే ఆడతానని తమీమ్ ఆఫర్ ఇచ్చాడట. దీనితో షకీబల్ అసలు టీమ్‌లో తమీమ్ అక్కర్లేదని చెప్పాడట. ౦అంతేకాకుండా తమీమ్‌పై షాకింగ్ కామెంట్స్ చేసాడు.

బోర్డు అధికారులు తనను మిడిలార్డర్‌లో ఆడమన్నారని, కానీ తనకు అదిఇష్టంలేదన్నాడు. దీనిపై షకీబల్ హసన్ మాట్లాడుతూ ఇది చిన్నపిల్లల గొడవలా ఉందని, బ్యాట్‌నాది కాబట్టి నేనే ఆడతానంటున్నాడు. రోహిత్ వంటి బ్యాటర్లుకూడా ఏడోస్థానంలో మొదలై ఓపెనర్‌కువచ్చాడని గుర్తుచేసాడు. జట్టుకోసం కాకుండా వ్యక్తిగత ప్రాప కంకోసం ఆలోచిస్తే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని షకీబల్ మండిపడ్డాడు.ఇలాంటి అన్‌ఫిట్‌ప్లేయర్‌ను తీసుకెళ్లలేనని షకీబల్‌అన్నాడుదీనితో ఇరువురి మధ్య టఫ్‌ఫైట్ నడుస్తోంది.

# గూగుల్, మెటా, ఎక్స్‌కు భారత్ షాక్!

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** మెటా, ఎక్స్, గూగుల్ సంస్థలకు భారత్ భారీ షాక్ ఇవ్వనుంది. త్వరలో ఆయా సంస్థల నుంచి 18శాతం ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ వసూలు చేయనున్నట్లు తెలుస్తోంది. పలు నివేదికల ప్రకారం, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ టాక్స్ అండ్ కస్టమ్ విభాగం ఐజిఎస్టీ నుంచి ఒఐడిఎఆర్ సంస్థలకు ఇకపై మినహాయింపు ఇవ్వబోదని తెలుస్తోంది. అక్టోబర్ నుంచి భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విదేశీ అడ్వటైజింగ్, క్లౌడ్ సర్వీస్, మ్యూజిక్, సబ్‌స్క్రిప్షన్ సర్వీసులు, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సేవలందిస్తున్న ఆయా కంపెనీల నుంచి ఐజిఎస్‌టిని వసూలు చేసేందుకు కేంద్రం సిద్ధమైందంటూ ఈ అంశంలో ప్రమేయం ఉన్న ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. ప్రస్తుతం ఒఐడిఎఆర్ సంస్థలు ఎలాంటి టాక్స్ చెల్లించే పనిలేదు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆయా సంస్థలకు పన్ను నుంచి మినహాయింపులు ఇస్తున్నాయి. కేవలం బిజినెస్ టూబిజినెస్ సర్వీస్‌లు అందించే కంపెనీలు మాత్రమే టాక్స్‌లు చెల్లిస్తున్నాయి. తాజాగా పన్నుల విభాగం తీసుకున్న నిర్ణయంతో ఒఐడిఎఆర్ సంస్థలైన మెటా, ఎక్స్, గూగుల్ వంటి సంస్థలమీద పన్నుభారం పడనుంది. ఒడిఐఆర్‌ని ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ డేటాబేస్ యాక్సెస్ అండ్ రీట్రీవల్ సర్వీసెస్ అని పిలుస్తారు. ఈ విభాగంలో సేవలందించే సంస్థలు వ్యక్తులు లేదంటే కస్టమర్లతో ఎలాంటి భౌతిక సంబంధంఉండదు. ఆన్‌లైన్ ద్వారా వినియోగదారుల అవసరాల్ని తీర్చుతాయి. గూగుల్, మెటా, ఎక్స్‌తో పాటు ఆన్‌లైన్ ద్వారా కస్టమర్ల అవసరాల్ని తీర్చే కంపెనీలు ఈ ఒఐడిఐఆర్ విభాగం కిందకే వస్తాయి.




# జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పతనం

**ముంబై, సెప్టెంబరు 29:** దేశంలో అత్యంత విలువైన కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పేరుగాంచింది. అయితే జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ డీమెర్జర్ అనంతరం కంపెనీ స్టాక్ విలువ దాదాపు 11శాతం పడిపోయింది. జులై 20నుంచి చూస్తే దాదాపు లక్షా 90వేల కోట్ల మార్కెట్ విలువ ఆవిరైంది. జెఎఫ్ఎస్ డీమెర్జర్ తర్వాత పరిస్థితిని గమనిస్తూ వచ్చిన బ్రోకరేజ్ సంస్థలు, రిలయన్స్‌ప్ల సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు అన్నీ బై రేటింగ్ ఇస్తున్నాయి. కొన్నైతే ఏకంగా టార్గెట్ ప్రైస్ 3వేల వరకు చెబుతుండడం విశేషం. వీటికి తోడు క్యూఐఎ, కెకెఆర్ వంటి స్ట్రాటజిక్ ఇన్వెస్టర్స్ కూడా రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌లో వాటా దక్కించుకున్నారు. ఎడిఐఎ 600 మిలియన్ డాలర్లను రిటైల్ బిజినెస్‌లో ఇన్వెస్ట్ చేయాలని చూస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రిలయన్స్‌పై బై రేటింగ్‌కు తాము కట్టుబడి ఉన్నట్లు నోమురా ఇండియా పేర్కొంది. 2024లో తన రెఫైనరీ బిజినెస్ ద్వారా కంపెనీకి మంచి మార్జిన్ లభిస్తున్నట్లు తెలిపింది. రిఫైనరీ మార్జిన్స్‌లో పెరుగుతున్న ప్రతి డాలర్‌కు ఎబిటా 2 శాతం, ఇపిఎస్ 5శాతం ఉండనున్నట్లు పేర్కొంది. భారీగా వృద్ధి అవకాశాలు ఉన్న కొత్త రంగాల్లోకి రిలయన్స్ అడుగుపెడుతుండడం కలిసిరానున్నట్లు ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కంపెనీ మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. తద్వారా దాదాపు 15 స్థిరమైన వృద్ధితో రాబడిని పెంచుకోనున్నట్లు వెల్లడించింది. బ్రాడ్‌బ్యాండ్ బిజినెస్‌లో పెరుగుతున్న చందాదారులతో పాటు గ్యాస్‌ఉత్పత్తి కూడా వృద్ధి చెందుతున్నట్లు తన నోట్‌లోపేర్కొంది. తద్వారా మార్జిన్‌లు మరింత మెరుగుపడతాయని భావిస్తోంది. మరిన్ని కొత్త స్టోర్లను జోడించడంతో కన్స్యూమర్ రిటైల్ బిజినెస్ కూడా బాగా వృద్ధి చెందుతున్నట్లు మోర్గాన్ స్టాన్లీ అభిప్రాయపడింది.




# మాస్టర్ కాంపోనెంట్స్ లిస్టింగ్ అంతంతే!


**ముంబై, సెప్టెంబరు 29:** దేశీయ స్టాక్ మార్కెట్లో శుక్రవారం మాస్టర్ కాంపోనెంట్స్ కంపెనీ ఎంట్రీ ఇచ్చింది. అయితే షేర్ల లిస్టింగ్ చాలా మందకొడిగా జరిగింది. ఐపిఒ ధర అయిన రూ.140 కంటే స్వల్పంగా 0.28శాతం అధిక ధరకు మార్కెట్లోకి అడుగుపెట్టాయి. దీంతో మంచి లాభాలను ఆశించిన ఇన్వెస్టర్లు నిరాశకు గురయ్యారు. ఐపిఒ కోసం ఒక్కో లాట్‌లో 1000 షేర్ల చొప్పున కంపెనీ విక్రయించింది. మాస్టర్ కాంపోనెంట్స్ తన ఐపిఒ ద్వారా రూ.15.43 కోట్లను మార్కెట్ల నుంచి సమీకరించింది. ఈ ఐపిఒలో మొత్తంగా 7లక్షల తాజా ఈక్విటీ షేర్లను విక్రయించింది. దీనిద్వారా రూ.9.80 కోట్లను సమీకరించింది. అలాగే ఆఫర్ ఫర్ సేల్ రూపంలో 4.02 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించి రూ.563 కోట్లను సేకరించింది. ఐపిఒ ద్వారా వచ్చిన సొమ్మును కార్పొరేట్ లక్ష్యాలు, వర్కింగ్ కేపిటల్ అవసరాల కోసం వినియోగించాలని నిర్ణయించింది. కంపెనీ ప్రధానంగా మౌల్డింగ్ వ్యాపా రంలో ఉంది. ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, మెడికల్, ఆటోమోటివ్ రంగాలఉత్పత్తులకు అవసరమైన కాంపొనెంట్స్ తయా రీ వ్యాపారంలో కంపెనీ ఉంది. ఈ రంగంలో ఇప్పటికే గట్టి పోటీ ఉన్నందున కొన్ని బ్రోకరేజీలు ఈ ఐపిఒను కొనుగోలు చేయ కుండా ఉంటే మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశాయి. అందువల్ల గ్రేమార్కెట్లో కంపెనీ షేర్లకు ఎలాంటి ప్రీమియం కూడా పలకలేదు.




# భారత్ అత్యంత విలువైన బ్రాండ్‌గా టిసిఎస్

## వాణిజ్యం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌గా ఐటి దిగ్గజ సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' తన స్థానాన్ని ఈ యేడాదీ నిలబెట్టుకుంది. కంపెనీ బ్రాండ్ విలువ 43 బిలియన్ డాలర్లుగా నమోదైనట్లు మార్కెటింగ్ డేటా, అనలిటిక్స్ సంస్థ తన నివేదికలో పేర్కొంది. బిజినెస్ టెక్నాలజీ కేటగిరిలో కఠినమైన పరిస్థితులు ఉన్నప్పటికీ, టిసిఎస్ ఈ ఘనత సాధించినట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న డిజిటల్ పరివర్తనను టిసిఎస్ విజయవంతంగా సొమ్ము చేసుకుంటోందని విశ్లేషించింది. ఈ యేడాది అగ్రగామి 75 విలువైన భారతీయ బ్రాండ్‌ల విలువ 4 శాతం తగ్గి 379 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు మార్కెటింగ్ డేటా, అనలిటిక్స్ సంస్థ కంటార్ తన నివేదికలో పేర్కొంది. కంపెనీ విక్రయాల్లో విదేశీ అమ్మకాల వాటా గణనీయంగా ఉన్న కారణంగా టిసిఎస్, ఇన్ఫోసిస్ వంటి బ్రాండ్ల విలువ తగ్గిందని తెలిపింది. అంతర్జాతీయ విపణుల్లో కీలకంగా వ్యవహరిస్తున్న సర్వీసెస్ ప్లాట్‌పామ్స్, బిజినెస్ టెక్నాలజీ రంగంలోని కంపెనీల బ్రాండ్ల విలువ పడిపోయినట్లు వెల్లడించింది. అంతర్జాతీయ ఒత్తిళ్లు, మందగమన భయాలు, భౌగోళిక రాజకీయాల అనిశ్చితులు ప్రభావం చూపినట్లు వివరించింది. ఈ యేడాది టిసిఎస్ బ్రాండ్ విలువలో 6శాతం, ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువలో 17శాతం క్షీణత నమోదైనట్లు తెలిపింది. బ్రాండ్‌లవిలువ విషయంలో భారత్ బలంగా ఉందని కూడా నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్త బ్రాండ్ల విలువలో 20శాతం క్షీణత కనిపించగా, భారత్‌లో అది నాలుగుశాతంగానే నమోదైనట్లు పేర్కొంది. కరోనా తర్వాత వచ్చిన రికవరీ ప్రభావం తగ్గినప్పటికీ, దేశీయ వినియోగం వల్ల భారత్ ఈ విషయంలో బలంగా ఉందని వివరించింది. ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో బ్రాండ్ విలువ 23శాతం పడిపోగా, భారత్‌లో మాత్రం ఇది 14శాతానికే పరిమితమైందని తెలిపింది. దేశ జిడిపి యేటా ఏడు శాతం సిఎజిఆర్ చొప్పున వృద్ధి చెందినట్లు గుర్తు చేసింది. అదే బ్రాండ్‌ల విలువ మాత్రం 19శాతం పెరిగినట్లు తెలిపింది. రాబోయే యేళ్లలో మరింత వేగవంతమైన వృద్ధి నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. కేటగిరీల వారీగా చూస్తే టెక్నాలజీ తర్వాత వాహన రంగ బ్రాండ్ల విలువలో అత్యధికంగా 19శాతం వృద్ధి నమోదైనట్లు పేర్కొంది. టిసిఎస్ బ్రాండ్ విలువం 59శాతం పెరిగి 1.90బిలియన్ డాలర్లుగా నమోదైనట్లు తెలిపింది. తర్వాత మహీంద్రా విలువ 19శాతం పెరిగి 2.01 బిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించింది. మొత్తం భారతీయ బ్రాండ్‌ల విలువకు ఆర్థిక సేవలు, టెలికం విభాగాలు కూడా గణనీయ వాటాను సమకూర్చాయని తెలిపింది.




# డ్రైవర్ ఖాతాలో రూ.9వేల కోట్లు..బ్యాంకు సిఇఒ రాజీనామా

**తిరువనంతపురం, సెప్టెంబరు 29:** ఒక పెద్ద పొరపాటు ఏకంగా సంస్థ అధినేత రాజీనామాకు దారి తీసింది. చెన్నైకి చెందిన ఓ క్యాబ్ డ్రైవర్ ఖాతాలో పొరపాటున రూ.9వేల కోట్లు జమ అయ్యాయి. తమిళనాడు మర్కంటైల్ బ్యాంకులో ఈ ఘటన జరిగింది. చెన్నైకి చెందిన క్యాబ్ డ్రైవర్ రాజ్ కుమార్‌కు తమిళనాడు మర్కంటైల్ బ్యాంకులో ఖాతా ఉంది. పొరపాటున అతడి ఖాతాలో వారంక్రితం రూ.9వేల కోట్లు జమ అయ్యాయి. అది చూసి రాజ్‌కుమార్ ఆశ్చర్యపోయాడు. దాని నిజం అని నమ్మకుండా, స్కామ్ అని అనుమానించాడు. ఇది నిజమా లేక నకిలీయా? అని తెలుసుకుందామని చెప్పి, తన స్నేహితుడికి రూ.21వేలు బదిలీ చేశాడు. సాఫీగానే బదిలీఅయ్యాయి. అరగంట తర్వాత జరిగిన పొరపాటును బ్యాంకు గుర్తించింది. రాజ్‌కుమార్ ఖాతా నుంచి జమ అయిన మొత్తాన్ని వెనక్కి తీసేసుకుంది. ఇప్పుడు తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు ఎండి, సిఇఒ ఎస్ కృష్ణన్ తన పదవికి రాజీనామా చేశారు. తన పదవీకాలం ఇంకా రెండొంతులు మిగిలి ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, సెప్టెంబరు 29:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు మార్కెట్లకు దన్నుగా నిలిచాయి. చివరికి సెన్సెక్స్ 320.90 పాయింట్లు పెరిగి 65,828.41 వద్ద నిలిచింది. నిఫ్టీ 114.75 పాయింట్లు పెరిగి 19,638.30 పాయింట్ల వద్ద నిలిచింది. డాలర్‌తో మారకంలో రూపాయి విలువ రూ.83.04 వద్ద నిలిచింది. ఎన్‌టిపిసి, టాటా మోటార్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, ఎస్‌బిఐ, అల్ట్రాటెక్ సిమెంట్స్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ఐసిఐసిఐ బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటిసి వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌సిఎల్ టెక్, టెక్ మహీంద్రా, టిసిఎస్, ఇన్ఫోసిస్, టైటాన్, నెస్లే ఇండియా, ఏసియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిసాయి.



# ఎయిర్‌టెల్‌కు ట్రాయ్ రూ.2.81 కోట్ల పెనాల్టీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రముఖ టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్‌కు టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ రూ.2.81 కోట్ల జరిమానా విధించింది. అనధికారిక వాణిజ్య కాల్స్‌ను నిరోధించడంలో విఫలమైనందుకు పెనాల్టీ విధించింది. టెలికం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్, 2018 నిబంధనలు ఉల్లంఘించినందుకు 2021 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి గానూ ట్రాయ్ ఈ జరిమానా విధించినట్లు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఎయిర్‌టెల్ పేర్కొంది. అయితే ట్రాయ్ ఆదేశాలను సమీక్షిస్తున్నామని, ఈ విషయంలో తదుపరి ఏం నిర్ణయం తీసుకోవాలన్నది పరిశీలిస్తున్నామని ఎయిర్‌టెల్ పేర్కొంది. మరోవైపు చందాదారులను ఇబ్బంది పెడుతున్న ప్రచార సందేశాలు, కాల్స్‌ను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని గతంలో టెలికం సంస్థలకు ట్రాయ్ ఆదేశాలు జారీచేసింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.